www.vishalabharati.com
epaper:vishalabharati.com


గురువారం, హైదరాబాద్
17 ఆగస్టు 2023
సంపుటి:1 సంచిక:303

# విశాల భారతి

తెలుగు దినపత్రిక



తెలంగాణ వచ్చి 9 ఏండ్లు దాటింది. కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠంపై కూర్చొని రెండు దశాబ్దాలు అవుతుంది. రాబోయే కొన్ని నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు రానున్నాయి. ఇప్పటికే గెలుపుపై ధీమాతో ఉన్న అధికార పార్టీ సీట్ల కోసం నేతల మధ్య లొల్లి షురువైంది. మళ్లీ మాదే అధికారం అంటూ ప్రజల్లోకి బలంగా వెళుతోంది. అయినా, ఎక్కడో వారు భయపడుతున్నట్టు కనిపిస్తోంది.




# కారు.. సారు.. గల్లంతేనా!!

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ప్రజల్లో అసంతృప్తి

- అంతర్మథనంలో అధికారపార్టీ నేతలు.
- క్రమంగా పెరుగుతున్న కాంగ్రెస్, బీజేపీల గ్రాఫ్.
- రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తీవ్ర పోటీ.
- మెజార్టీ స్థానాల్లో విజయానికి కేసీఆర్ వ్యూహాలు.
- రాజకీయ లబ్ధికే కేసీఆర్ వరుస ప్రకటనలు.
- గులాబీ నేతల్లో తారాస్థాయిలో వర్గ విభేదాలు.
- విందు రాజకీయాలు, పోటాపోటీగా ప్రచారాలు.

### అధికార పార్టీ నేతలపై అసంతృప్తి

మరోవైపు కాంగ్రెస్ తరఫున గెలిచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన నేతలపై ప్రజలకు విశ్వాసం సన్నగిల్లుతోంది. ముఖ్యంగా ఆయా అసెంబ్లీ సెగ్మెంట్లలో వారంటే అసహ్యించుకునే పరిస్థితి కనిపిస్తుంది. అందుకే కొత్తగా అధికారపార్టీలో చేరేవారు ఈ దుస్థితిని చూసి వెనుకంజ వేస్తున్నట్టు తెలుస్తోంది. అధికార మార్పునకు ప్రజలు రెడీగా ఉన్నట్లు కనిపిస్తున్నా.. కేసీఆర్ నిలబెట్టే అభ్యర్థుల సామర్థ్యాలే ఈసారి కీలకం కానున్నాయి. అదే సమయంలో విపక్షాల అభ్యర్థుల సమర్థత కూడా ఓటర్లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. గతంలో మాదిరిగా కేసీఆర్ ను చూసి ప్రజలు ఓటేసే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటికే ప్రజలకు కేసీఆర్ నైజం తెలిసిపోయింది. మరోవైపు గులాబీ నేతల మధ్య ఉన్నవర్గ పోరుతో వచ్చే ఎన్నికలలో అధికార పార్టీకి బ్రేకులు పడటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు

**తెలంగాణ బ్యూరో,విశాల భారతి:** మునుగోడు ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టిన ప్రజలు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎలా స్పందిస్తారోనని అధికారపార్టీ నేతలు అంతర్మథనంలో ఉన్నారు.

**అధికార పార్టీపై వ్యతిరేకత**

రాష్ట్రంలో వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ కు సహజంగానే జనంలో కొంత వ్యతిరేకత ఉంటుంది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలపై అసంతృప్తి స్పష్టంగా కనిపిస్తోంది. కర్ణాటక ఎన్నికల తర్వాత కాంగ్రెస్, మునుగోడు తర్వాత బీజేపీలు తమ విజయావకాశాల గ్రాఫ్ పెంచుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో రానున్న ఎన్నికల్లో తీవ్ర పోటీ ఉంటుందని, మెజార్టీ స్థానాలు హస్తగతం చేసుకోవాలని అధికార పార్టీ అధినేత పదునైన వ్యూహాలతో ముందుకుపోతున్నట్టు కనిపిస్తోంది. దాంట్లో భాగంగా వికలాంగుల పింఛన్ పెంపు, ఆర్టీసీ విలీనం, రుణమాఫీ, బీసీ బంధు లాంటి పథకాల ప్రకటన అని అందరూ భావిస్తున్నారు. గతంలో అడిగినా ఇవ్వని కేసీఆర్ ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులకు ఐఆర్, పీఆర్సీ ప్రకటనలు కూడా రాజకీయ లబ్ధికే అని అంటున్నారు. ప్రజలు కూడా వీటిని పెద్దగా పట్టించుకుంటున్న దాఖలాలు లేవు. ఇస్తున్నారు కదా తీసుకుంటాం అని చెబుతున్నారు.

**నేతల మధ్య అంతర్గత తగాదాలు**

అయితే గులాబీ పార్టీలో అంతర్గత తగాదాలు కలవరం పుట్టిస్తున్నాయి. ఆయా నియోజకవర్గాలలో గ్రూప్ తగాదాలు, టికెట్ ఆశిస్తున్న నాయకుల మధ్య ఆధిపత్య పోరు ఆ పార్టీకి సమస్యగా తయారైంది. కొన్ని నియోజకవర్గాల్లో

..మిగతా |2| లో



# వంద రోజులు కష్టపడుదాం..

## కాంగ్రెస్ పాలన తెచ్చుకుందాం..

- ఓడిపోతామనే భయంతో కేసీఆర్ ఎత్తులు..
- ప్రతి పార్లమెంట్ పరిధిలో బీసీలకు రెండు సీట్లు ఇస్తాం.
- బంగారు తెలంగాణ వద్దు.. బతుకు తెలంగాణ చాలు..
- రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యం.
- పీసీసీ స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.

**భువనగిరి,విశాల భారతి:** రాబోయే వంద రోజులు కష్టపడి కాంగ్రెస్ పాలన తెచ్చుకుందామని కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం భువనగిరి పట్టణంలో జరిగిన ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశానికి కాంగ్రెస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ పరిశీలకులు శ్రీనివాస్ మానేతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ .. కాంగ్రెస్ అధినేత్రి ఆంధ్రప్రదేశ్‌లో పార్టీని త్యాగం చేసి తెలంగాణ ఇస్తే.. 9 ఏండ్ల పాలనలో కేసీఆర్ నియంతగా పాలిస్తూ పేదలను నిండా ముంచారని మండిపడ్డారు. పేదలకు డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తానని చెప్పి.. ఇవ్వకుండా మోసం చేశారన్నారు. బంగారు తెలంగాణ కాదు.. బతుకునిచ్చే తెలంగాణ కోసం కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు.

ఔటర్ రింగ్ రోడ్డు అమ్మి రుణమాఫీ..సీఎం కేసీఆర్ ఎన్ని సర్వేలు చేసినా.. వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలియడంతో ఔటర్ రింగ్ రోడ్డును రూ. 90వేల కోట్లకు అమ్మి ఆ పైసల రైతు రుణమాఫీ చేస్తున్నాడని ఆరోపించారు. అది రైతు రుణ మాఫీ కాదు.. వడ్డీ మాఫీ.. మాత్రమేనన్నారు. వరంగల్ డిక్లరేషన్‌లో కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు 30 ఏండ్ల అగ్రిమెంట్ అని.. ఆ రోడ్డు వేసినప్పుడు తాను ఐటీ మినిస్టర్‌గా ఉన్నానన్నారు. రోడ్డు వేసేందుకు రూ.6,500 కోట్లు ఖర్చు అయితే.. రూ. 7,300 కోట్లకు 30 సంవత్సరాలకు లీజుకు ఇవ్వడం దుర్మార్గమన్నారు. ప్రస్తుతం లీజుకు నడుపుతున్న కంపెనీకి సంవత్సరానికి రూ. 600 కోట్లు వస్తుండగా.. 30 ఏండ్లకు రూ. 1. 80 వేల కోట్లు వస్తాయన్నారు. ఎన్నికల్లో గెలిచేందుకు అడ్డదారులు తొక్కుతూ రాష్ట్రానికి తీవ్ర నష్టం చేస్తున్నారని మండిపడ్డారు.

**బతుకునిచ్చే తెలంగాణను సాధించుకుందాం..**

'బంగారు తెలంగాణ కాదు.. మన పిల్లలకు బతుకునిచ్చే తెలంగాణ సాధించుకుందాం' అని కోమటిరెడ్డి పిలుపునిచ్చారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంలో రాష్ట్రంలో నిరుద్యోగ యువత అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు రాష్ట్రంలో 4. 80 వేల మంది.. బీఈడీ విద్యార్థులు ఉద్యోగం కోసం కోచింగ్ సెంటర్లల్ల మగ్గుతుంటే.. తొమ్మిదేండ్ల పాలనలో ఒక్క టీఆర్టీ నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదన్నారు. టీచర్లు

..మిగతా |2| లో

### రూ. 20 వేల కోట్లకు స్కెచ్..

ఎన్నికల కోసమే కోకాపేట, బుద్వేల్‌లో భూములు అమ్ముతున్నారని ఆరోపించారు. భూములు అమ్మగా రూ. 5,000 కోట్లు వచ్చాయని, వైన్స్ షాపుల టెండరు ద్వారా 6,000 కోట్లు, అలా అన్నీ కలుపుకుని దాదాపు రూ. 20 వేల కోట్లు ఎలక్షన్స్ లో ఖర్చు చేసేందుకు కేసీఆర్ ప్లాన్ వేసుకుంటున్నారన్నారు. బీసీ బంధు, దళిత బంధు, మైనారిటీ బంధు పేరుతో రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు.



## రెండు రైల్వే ప్రాజెక్టులకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

### వ్యయం రూ. 9 వేల కోట్లు

**న్యూఢిల్లీ,విశాల భారతి:** రాష్ట్రంలోని కీలక రైల్వే లైన్ల అభివృద్ధికి కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ ఉపసంఘం పచ్చజెండా ఊపింది. గుంటూరుబీబీనగర్ సింగిల్ డబ్లింగ్, ముద్కేఢ్‌మేడ్చల్, మహబూబ్‌నగర్‌డోన్ మధ్య డబుల్ డబ్లింగ్ వంటి రెండు కీలక రైల్వే డబ్లింగ్ ప్రాజెక్టులకు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. వీటిని సుమారు రూ.9వేల కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్నారు. ఏప్రిల్ నెలలో ప్రధాని హైదరాబాద్ పర్యటనకు విచ్చేసినప్పుడు.. రూ.1,410 కోట్లతో నిర్మించిన 85 కిలోమీటర్ల డబ్లింగ్ రైల్వే లైన్ను జాతికి అంకితం ఇచ్చారు. గుంటూరుబీబీనగర్ మార్గంలో 239 కిలోమీటర్ల డబ్లింగ్ ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది. ఈ ప్రాజెక్టును రూ.3,238 కోట్లతో 239 కిలోమీటర్ల పొడవైన మార్గాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే.. హైదరాబాద్‌చెన్నై మధ్య 76 కిలోమీటర్ల దూరం తగ్గనుందని రైల్వే శాఖ తెలిపింది. అలాగే హైదరాబాద్‌విజయవాడ మధ్య కూడా దూరం తగ్గనుంది. ఈ మార్గం అభివృద్ధి చేయడం ద్వారా నగరాల మధ్య రైళ్ల వేగం కూడా పెరగనుంది. సిమెంట్ పరిశ్రమలు ఎక్కువగా ఉండడంతో.. సరుకు వేగం కూడా పెరిగేందుకు ఆస్కారం ఉందని రైల్వే శాఖ అభిప్రాయపడుతోంది.

**ముద్కేఢ్-మేడ్చల్, మహబూబ్నగర్-డోన్ మధ్య డబ్లింగ్ పనులకు ఆమోదం...**

ఇంకోవైపు ముద్కేఢ్‌మేడ్చల్, మహబూబ్నగర్‌డోన్ మధ్య రూ.5618 కోట్ల విలువ చేసే డబుల్ డబ్లింగ్ పనులకు కూడా కేంద్ర కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ మార్గాల అభివృద్ధితో హైదరాబాద్‌బెంగళూరు మధ్య 50 కిలోమీటర్ల మేర ప్రయాణ దూరం తగ్గనుందని రైల్వేశాఖ వెల్లడించింది. ఈ కొత్త మార్గం పూర్తయితే వందే భారత్ వంటి రైళ్లకు కూడా ఉపయోగకరంగా ఉంటుందని రైల్వే మంత్రిత్వ శాఖ ప్రకటన విడుదల చేసింది.

## చేతివృత్తుదారులందరికీ సబ్సిడీపై రూ.2 లక్షలు లోన్..

### -కేంద్రం గుడ్ న్యూస్



**న్యూఢిల్లీ,విశాల భారతి:** ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ చేసిన కీలక ప్రకటనలకు కేంద్రమంత్రి మండలి ఆమోదం తెలిపింది. బీసీ కులవృత్తులకు అండగా ఉండడమే లక్ష్యంగా ప్రకటించిన 'విశ్వకర్మ' పథకానికి రూ. 13,000 కోట్లు కేటాయించింది. విశ్వకర్మ పథకం ద్వారా చేతివృత్తుల వారికి రూ. 2 లక్షల వరకు రుణాలు ఇవ్వనుంది. రోజుకు 500 రూపాయల ఉపకార వేతనంతో శిక్షణ కార్యక్రమాలు ఇవ్వనున్నట్లు తెలిపిన కేంద్రం.. ఆ తర్వాత పరికరాల కొనుగోలు చేసేందుకు రూ.15 వేలు ఆర్థిక సాయం అందించనుంది. శిక్షణ తర్వాత 5శాతం వడ్డీతో లక్ష రూపాయల రుణం ఇవ్వనుంది. తొలి విడత రుణం సద్వినియోగం చేసుకుంటే అదనంగా మరో లక్ష రుణం ఇవ్వనున్నట్లు ప్రకటించింది. సెప్టెంబర్ 17న ప్రారంభం కానున్న ఈ పథకం ద్వారా 30లక్షల మంది సంప్రదాయ చేతివృత్తి కళాకారులు, చేనేత కార్మికులు, స్వర్ణకారులు, కులవృత్తులు చేసేవారు లబ్ధిపొందనున్నట్లు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. అలాగే పీఎం ఈబస్ సేవా పథకానికి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. దేశవ్యాప్తంగా 10 వేల ఈసిటీ బస్సులను అందుబాటులోకి తేవాలని నిర్ణయించింది. దేశవ్యాప్తంగా ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యంలో 169 నగరాల్లో ఈసిటీ బస్సులు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించిన

..మిగతా |2| లో



ఐదు దశల్లో డబుల్ బెడ్ రూం

## ఇళ్ల పంపిణీ..

- వచ్చే వారంలో మొదటి దశ ప్రారంభం.
- పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటన.

|2| లో




## ఇండియా కూటమికి బీటలు

- శరద్ పవార్ దూరమయ్యే చాన్స్?..
- అజిత్ పవార్ తో చర్చలు
- బీజేపీ రాజకీయ ఎత్తుగడలో భాగమేనా?
- ప్రధాని అభ్యర్థిగా ప్రకటించడం లేదని అలక?

|2| లో



రక్షణశాఖ స్టాండింగ్ కమిటీలోకి

## రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,విశాల భారతి:.** 'మోదీ' ఇంటిపేరుపై వ్యాఖ్యలు చేశారన్న కేసులో లోక్‌సభ సభ్యత్వం కోల్పోయిన రాహుల్ గాంధీ.. సుప్రీంకోర్టు స్టే ఇవ్వడంతో ఆయన సభ్యత్వాన్ని పునరుద్ధరించారు. దీంతో ఇటీవల జరిగిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో తాజాగా రక్షణశాఖపై పార్లమెంటరీ

..మిగతా |2| లో




## అరెస్ట్ నంబర్ 99

- టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలో సిట్ దూకుడు

|2| లో

# కారు.. సారు.. గల్లంతేనా!!

మొదటిపేజీ తరువాయి

పచ్చి గడ్డి వేస్తే భగ్గుమనే స్థాయిలో విభేదాలు ఉన్నాయి. అయితే బీఆర్ఎస్ అధినేతలు వాటిని సద్దుమణిగేలా చేస్తున్నా.. ఎన్నికల నాటికి అవి తీవ్ర రూపం దాల్చవచ్చన్న అభిప్రాయం రాజకీయ పరిశీలకుల్లో ఉంది. సిట్టింగ్ లకు సీట్లు ఇస్తే పనిచేసేది లేదని అధినాయకుల దగ్గర పంచాయతీలు నడుస్తున్నాయి. ఈసారి తమకే సీటు ఇవ్వాలని చాలాచోట్ల కోరుతున్నారు. గత 22 ఏండ్లుగా పార్టీలో ఉన్నా.. తమకు అన్యాయం జరుగుతుందని ఉద్యమ నాయకులు బాహటంగానే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వలస నాయకులు, ఉద్యమ నాయకులుగా విడిపోయి వర్గాలుగా తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారు.

**నాలుగు గ్రూపుల మధ్య ఆధిపత్య పోరు**

ఒకరంటే ఒకరు పైకి గౌరవించుకున్నట్లు కనిపిస్తున్నా లోలోపల గ్రూపు రాజకీయాలు నడుస్తున్నాయి. బహిరంగంగా విభేదాలు కనిపించకపోయినా.. అంతర్గతంగా ఒకరంటే ఒకరికి పడడం లేదని సమాచారం. ముఖ్యంగా సీట్ల పంపిణీ విషయంలో ఇది ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత ఇలా నాలుగు వర్గాలు విడిపోయి.. తమను నమ్ముకున్న వారికి న్యాయం చేసేందుకు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని స్థానాల్లో ఈ వర్గాల అభ్యర్థులు ఇప్పటికే పోటాపోటీగా ప్రచారాలు చేసుకోవడం, విందుల రాజకీయాలు నడపడం పార్టీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. గెలుపు అవకాశాలపై ఇప్పటికే అనేక సర్వేలు నిర్వహించిన కేసీఆర్.. వాటి ఆధారంగానే టికెట్ల కేటాయింపు ఉంటుందని కుండబద్దలు కొడుతున్నారు. అయితే, నియోజకవర్గాల వారీగా సామాజిక సమీకరణలు, ఆశావహులు, వారి బలాబలాలు, ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల బలాబలాల ఆధారంగానే తుది ఎంపిక ఉంటుందని పార్టీ పెద్దలు చెబుతున్నారు. అయితే, ఇందులో ఏ వర్గానికి ఎక్కువ సీట్లు వస్తాయో కొద్ది రోజుల్లో తేలిపోనుంది.

# ఇండియా కూటమికి బీటలు

విశాలభారతి, నేషనల్ బ్యూరో:

ఇంకా పుట్టీ పుట్టకముందే ఇండియా పేరిట ఉన్న విపక్ష కూటమి అనేక సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ కూటమిని చీల్చేందుకు ఎటూ బీజేపీ వ్యూహాలు ఉండనే ఉన్నాయి. వాటికి తోడు అన్నట్లుగా ఇండియా కూటమిలో లుకలుకలు రోజుకు ఒకటి వంతున బయటపడుతున్నారు కూటమిలో ఉన్న విపక్ష నేతల మధ్య ఒకరి మీద ఒకరికి విశ్వాసం లేదని అంటున్నారు. అదే సమయంలో వృద్ధ నేత, సీనియర్ మోస్ట్ పార్లమెంటేరియన్ అయిన శరద్ పవార్ ఇండియా కూటమికి బిగ్ హ్యాండ్ ఇవ్వబోతున్నట్లుగా ఢిల్లీ స్థాయిలో అయితే ప్రచారం సాగుతోంది. దీని వెనక బీజేపీ రాజకీయ వ్యూహాలు ఉన్నాయని అంటున్నారు. ఆగస్ట్ నెల మొదట్లో పూణెలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, శరద్ పవార్ ఒకే వేదికను పంచుకున్న సంగతి విధితమే. ఎంతో సీనియర్ అయిన పవార్ ప్రధాని ఏనాడో కావాల్సిదని కాంగ్రెస్ పార్టీ వారసత్వ రాజకీయాల మూలంగానే ఆయన కాలేకపోయారని ప్రధాని నాడు వ్యాఖ్యానించిన సంగతిని కూడా ప్రచారంలో ఉంచారు. ఇదంతా పవార్ ని దువ్వే ప్రయత్నం అని వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇదిలా ఉంటే శరద్ పవార్ తో బీజేపీ పంచన చేరిన ఆయన మేనల్లుడు అజిత్ ఇటీవల ఒక రహస్య సమావేశాన్ని నిర్వహించారు. పుణేలోని ఓ డెవలపర్ నివాసంలో శనివారం జరిగింది. ఈ సందర్భంగా శరద్ పవార్ ని కూడా బీజేపీ వైపు గా తీసుకుని వచ్చేందుకు ఒక బ్రహ్మాండమైన ప్లాన్ ని కాషాయ పెద్దలు వేసి దాన్ని అజిత్ పవార్ ద్వారా అమలులో పెట్టారని అంటున్నారు. శరద్ పవార్ కి కేంద్రంలో కీలకమైన వ్యవసాయ మంత్రి పదవిని ఆయన కుమార్తె సుప్రియా సూలేకి కేంద్ర మంత్రిగా ఇంకో పదవి ఇచ్చేందుకు బీజేపీ అంగీకరించిందని అంటున్నారు. ఆ సందేశాన్ని అజిత్ పవార్ శరద్ పవార్ కి మోసుకొచ్చారని అంటున్నారు. వచ్చే ఎన్నికలు బీజేపీకి చాలా ముఖ్యం. దేశంలో ఎక్కువ ఎంపీ సీట్లు ఉన్న రాష్ట్రాలలో మహారాష్ట్ర ఒకటి. అక్కడ 48 సీట్లు ఉన్నాయి. దాంతో శరద్ పవార్ ఎన్సీపీని తమ వైపు తిప్పుకుంటే ఈసారి కచ్చితంగా 40 సీట్లకు తక్కువ లేకుండా గెలుచుకోవచ్చు అన్నది బీజేపీ ప్లాన్. పెద్దాయనను అలా తమ వైపునకు తిప్పుకోవాలని బీజేపీ చూస్తోంది. అయితే దీని మీద శరద్ పవార్ ఏమన్నారో తెలియదు కానీ ఈ రహస్య భేటీ మాత్రం మహారాష్ట్రలోని మహా వికాస్ అగాఢీ కూటమిలో చిచ్చు రేపుతోంది. దీని వల్ల కూటమికే ఎసరు వస్తుందని విపక్ష నేతలు అంటున్నారు. అయితే ఈ భేటీ మీద శరద్ పవార్ స్పందిస్తూ తన సొంత మేనల్లుడితో భేటీ కూడా విశేషమేనా అని ప్రశ్నిస్తున్నారు. ఇది రాజకీయాలకు సంబంధం లేని విషయం అంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎన్సీపీని బీజేపీకి దగ్గర చేయనీయమని కూడా ఆయన ఒట్టేసి చెబుతున్నారు. ఇదే మాటను ఆయన కుమార్తె సుప్రియా సూలే కూడా చెబుతున్నారు.

కానీ ఈ రహస్య భేటీ మీద అటు మహారాష్ట్ర కాంగ్రెస్ నేతలు అయితే శరద్ పవార్ మీద మండిపోతున్నారు. పవార్ ఈ భేటీ విషయంలో ఎన్ని చెప్పినా తాము మాత్రం రాహుల్ గాంధీకి ఫిర్యాదు చేస్తామని అంటున్నారు. ఎన్సీపీ లేకపోయినా కూడా వచ్చే ఎన్నికల్లఒ ఎదుర్కోవడానికి మహా వికాస్ అగాఢీ కూటమి సిద్ధంగా ఉంది అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే శివసేన కూడా ఘాటుగానే రియాక్ట్ అవుతోంది. ఈ భేటీ మంచిది కాదని అంటోంది. దీనిని తాము తప్పు పడతామని అంటోంది. ఇదిలా ఉంటే ఇండియా కూటమి నుంచి శరద్ పవార్ దూరంగా జరిగితే మాత్రం భారీ బీటలు పడతాయని అంటున్నారు.

అయితే 83 ఏళ్ళు పై దాటిన శరద్ పవార్ ని ఇండియా కూటమికి ప్రధానిగా ప్రకటించడంలేదన్న అసంతృప్తి అయితే ఎన్సీపీ నేతలలో ఉంది అని అంటున్నారు. బీహార్ సీఎం నితీష్ కుమార్ ప్రధాని పదవి మీద కన్నేశారు అని అంటున్నారు. ఇక కాంగ్రెస్ సైతం శరద్ పవార్ వైపు చూడడంలేదని అంటున్నారు



# ఐదు దశల్లో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ..

- వచ్చే వారంలో మొదటి దశ ప్రారంభం.
- పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ప్రకటన.

హైదరాబాద్,విశాల భారతి:. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్లో నిర్మించిన రెండు పడకల గదుల ఇళ్ల పంపిణీ కార్యక్రమాన్ని వారం రోజుల్లో ప్రారంభించనున్నట్లు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఇళ్ల నిర్మాణం, పంపిణీ సంబంధిత అంశాలపై మంత్రి ప్రగతిభవన్లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. నగరానికి చెందిన మంత్రులు తలసాని, సబిత, మహమూద్ అలీ, మల్లారెడ్డి, ఉపసభాపతి పద్మారావుగౌడ్, జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఇళ్ల పంపిణీ విషయమై స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన ప్రకటనకు అనుగుణంగా తదుపరి కార్యాచరణపై చర్చించారు. ఇప్పటికే 70వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకుని పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు. అర్హులైన లబ్ధిదారులకు అందించే కార్యక్రమం వేగంగా నడుస్తుందని వివరించారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ దాదాపు పూర్తి కావొచ్చిందని తెలిపారు. రెండు పడకల గదుల ఇళ్ల పంపిణీపై పలు సూచనలు, సలహాలు మంత్రులు చేశారు. నగర ప్రజలు ఇళ్ల పంపిణీ విషయంలో ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని అన్నారు. లబ్ధిదారుల గుర్తింపులో ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదని, పూర్తిగా అధికార యంత్రాంగమే క్షేత్రస్థాయి పరిశీలన పూర్తిచేసి అర్హులను గుర్తిస్తోందని వివరించారు. అర్హులైన లబ్ధిదారులందరికి కేటాయించనున్న ఇళ్ల వద్దే అప్పగించేలా పంపిణీ కార్యక్రమం ఉండాలని మంత్రులు సూచించారు. గృహలక్ష్మి పథకానికి సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక, పథకాన్ని మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లే విధంగా ఈ సమావేశంలో చర్చించారు.

# వంద రోజులు కష్టపడుదాం..

మొదటిపేజీ తరువాయి

లేక రాష్ట్రంలో 70 వేల గవర్నమెంట్ స్కూళ్లు మూత పడ్డాయని వాపోయారు. సమయానికి జీతాలు రాక ఉద్యోగులు ఇబ్బందులు పడుతుంటే, గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని మండిపడ్డారు.

**బస్వాపూర్ ఊసే లేదు...**

యాదాద్రి జిల్లాలో బస్వాపూర్ రిజర్వాయర్ నింపుతామని ప్రగల్భాలు పలికిన సీఎం, కొండ పోచమ్మ, మల్లన్న సాగర్ నింపుకొని తెద్దు చూపారని మండి పడ్డారు. రైతుల నష్ట పరిహారంలోనూ బస్వాపూర్ రైతులపై పక్షపాతం చూపారన్నారు. ఆలేరులో గంధమల్ల రిజర్వాయర్ ను పట్టించుకోవడం లేదన్నారు. స్టేషన్‌గన్‌పూర్ రిజర్వాయర్ నుంచి నీళ్లను ఇవ్వకుండా గుండాల మండలాన్ని ఎండబెట్టారన్నారు.

**ఎంపీగా ఎంతో అభివృద్ధి చేశా..**

ఎంపీగా భువనగిరి పార్లమెంట్ ను ఎంతో అభివృద్ధి చేశానని కోమటిరెడ్డి తెలిపారు. రూ. 1200 కోట్లతో ఎయిమ్స్‌లో 24 అంతస్తుల రెండు బిల్డింగ్స్ నిర్మిస్తున్నామన్నారు. గౌరెల్లి నుంచి భద్రాచలం వరకు రూ. 2,300 కోట్లతో పనులు మొదలు పెట్టించానని, జీడికల్ వద్ద రూ. 60 కోట్లతో అండర్‌పాస్, రూ. 30 కోట్లతో వంగపల్లి వద్ద అండర్ పాస్ .. ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. పేదవాళ్లకు సొంత డబ్బులిచ్చి ఆదుకుంటాను తప్పా.. రియల్ ఎస్టేట్, ప్లాట్ల దందా చేసేటోన్ని కాదని చెప్పారు. ఎన్నో గ్రామాల్లో మహిళలకు కుట్టుమిషన్లు ఇప్పించానన్నారు.

**కేటీఆర్ బాత్‌రూమ్స్ కడుగుతుండేమో..**

రేవంత్‌రెడ్డి రైతులకు 3 గంటల విద్యుత్ చాలు అన్నాడని కేటీఆర్ ఆయన దిష్టిబొమ్మలను తగలబెట్టించాడన్నారు. రేవంత్ రెడ్డి అలా అనలేదన్నారు. తాను మొదటి సారి ఎమ్మెల్యే అయినప్పుడు కేటీఆర్ అమెరికాలో బాత్‌రూమ్స్ కడుగుతుండేమో అని ఎద్దేవా కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. రైతులకు 24 గంటలు కరెంట్ ఇస్తున్నామని ప్రగల్భాలు పలికితే తాను సబ్‌స్టేషన్ల వద్దకు వెళ్లి లాగ్‌బుక్ చెక్ చేశానన్నారు. రోజుకు సరిగా 8 గంటలు ఇవ్వడం లేదని, అక్కడి సిబ్బంది చెప్పారన్నారు.

**బీసీలకు బరా బర్ రెండు సీట్లు..**

'నలుగురు రియల్ ఎస్టేట్ దందా చేసే చెంచాగాళ్లను బీఆర్ఎస్ పార్టీలో చేర్చుకుని తన మీద విమర్శలు చేస్తే ఖబర్దార్ అంటూ కోమటిరెడ్డి హెచ్చరించారు కాంగ్రెస్ పార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ బీసీలకు ప్రతి పార్లమెంట్ పరిధిలో రెండు సీట్లు ఇవ్వాలని ఆదేశించారని, బరాబర్ ఇస్తామని స్పష్టం చేశారు. బీసీలను కేసీఆర్ నిలువునా మోసం చేశారన్నారు. రాష్ట్రంలో 70 శాతం ఉన్న బీసీలకు సరియైన స్థానమివ్వలేదన్నారు. అరశాతం ఉన్న వెల్మలకు, 6 శాతం ఉన్న రెడ్లకు మెజారిటీ మంత్రి పదవులిచ్చారని మండిపడ్డారు.

**ప్రచారం షురూ అయినట్టే..**

'కాంగ్రెస్ ఎన్నికల ప్రచారం షురూ అయినట్టే.. వందరోజులు కష్టపడండి .. ఐదేండ్లు కాపాడుకుంటాం' అని కోమటిరెడ్డి కాంగ్రెస్ క్యాడర్‌కు పిలుపునిచ్చారు.. కాంట్రాక్టర్లు రియల్ ఎస్టేట్ వ్యాపారులు పార్టీ వీడితే అధైర్యపడొద్దని, ఒకడు పోతే వెయ్యి మందిని తయారు చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. పైసా ఖర్చు చేయకున్నా ఎంపీగా గెలిచిన గడ్డ భువనగిరి అన్నారు.

**పార్లమెంట్ పరిధిలో 7 సీట్లు గెలుస్తాం..**

కర్ణాటకలో మోడీ, అమిత్‌షా వంద మీటింగ్స్, వంద ర్యాలీలు తీసినా కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో గెలిచిందన్నారు. తెలంగాణలోనూ అదే జరగబోతోందన్నారు. రాష్ట్రంలో బీసీలు, దళితులు, మైనారిటీలు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో ఏడుకు ఏడు సీట్లు గెలుస్తామని వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రెసిడెంట్ సంజీవ్ రెడ్డి, నల్గొండ డీసీసీ ప్రెసిడెంట్ శంకర్‌నాయక్, జనగామ డీసీసీ ప్రెసిడెంట్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పీసీసీ నాయకులు రాజయ్య, పాల్వాయి స్రవంతి, శోభారాణి, చిలుక మధుసూధన్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉదయ్‌పూర్ డిక్లరేషన్ అమలు చేయాలి: మర్రి నిరంజన్‌రెడ్డి



చాలా మంది పార్లమెంట్ మెంబర్లు ఢిల్లీలో ఉంటే భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడని పీసీసీ సభ్యులు మర్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని ప్రభుత్వం వ్యవస్థలను నిర్వీర్యం చేస్తూ ఆర్టీసీని చంపేసిందన్నారు. గతంలో ఆర్టీసీలో 9,600 సిబ్బంది ఉంటే గత తొమ్మిదేళ్ల పాలనలో ఒక్కరిని కూడా రిక్రూట్ చేయలేదన్నారు. వారినే ప్రభుత్వంలో విలీనం చేసిందన్నారు. బీఆర్ఎస్‌ను ఓడించేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలన్నారు. కష్టపడి పనిచేసిన నాయకులకు గుర్తింపు దక్కేందుకు ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ను అమలు చేయాలని నిరంజన్‌రెడ్డి పార్లమెంట్ అబ్జర్వర్ శ్రీనివాస్ మానేను కోరారు. యాభై శాతం సీట్లు, 52 ఏళ్ల లోపు వారికి ఇవ్వాలన్న నిబంధనను అమలు చేయాలని డిమాండ్ చేశారు.



## బూత్ లెవల్‌లో ప్రచారం చేయాలి: శ్రీనివాస్ మానే

తాము కర్నాటకలో బీజేపీ అనే ఒక్క రాక్షసుడితో కొట్లాడి గెలిచామని, కానీ తెలంగాణలో కాంగ్రెస్ శ్రేణులు బీఆర్ఎస్, బీజేపీ అనే బలమైన రెండు రాక్షసులతో కొట్లాడి గెలవాలని పిలుపునిచ్చారు. అందుకే ప్రతి కాంగ్రెస్ కార్యకర్త వంద రోజులు అహర్నిశలు శ్రమించాలని సూచించారు. . ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ పాలనా లోపాలు ప్రజలకు వివరించాలని కోరారు. బూత్ లెవల్ కు వెళ్లి పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయన్నారు.



ప్రసంగిస్తున్న కొమ్మూరు ప్రతాపరెడ్డి



ప్రసంగిస్తున్న వేదాసు శ్రీధర్



ప్రసంగిస్తున్న భూపతిగల్ల మహిపాల్

# కేటీఆర్ కమీషన్ 30%..

హైదరాబాద్,విశాల భారతి:



మంత్రి కేటీఆర్ అవినీతి పరుడని మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఆరోపించారు. ప్రతి ఐటీ కంపెనీ నుంచి 30 శాతం కమీషన్ వసూలు చేస్తున్నాడని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఏం చేసిందో.. కేటీఆర్ వాళ్ల బాబు కేసీఆర్ ను అడగాలని సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కామారెడ్డి పర్యటనలో మాజీ మంత్రి షబ్బీర్ అలీపై విమర్శలు చేయడంతో ఆయన ఘాటుగా విరుచుకుపడ్డారు. గాంధీ భవన్‌లో ప్రెస్ మీట్ పెట్టిన షబ్బీర్ అలీ వచ్చే ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్ లను ప్రజలు తరిమికొట్టకపోతే పేరు మార్చుకుంటానని సవాల్ చేశారు. కేటీఆర్ కామారెడ్డి నుండి వెళ్తే ఆ రోడ్డు మొత్తం బంద్ పెట్టారు. షాప్ లు క్లోజ్ చేశారు.. బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. కేటీఆర్ ప్రోగ్రాం ఉందని కాంగ్రెస్ నేతలను రాత్రే అరెస్ట్ చేశారు.. ఎల్లారెడ్డి కాంగ్రెస్ నేత సుభాష్‌రెడ్డి ని హౌజ్ అరెస్ట్ చేశారని.. అందర్నీ బంధించి కామారెడ్డిలో పర్యటించి వెళ్లారని విమర్శించారు.

కాంగ్రెస్ మీద మాట్లాడే తీరు చూస్తే కేటీఆర్ పూర్తి అహంకారంతో ఉన్నారని షబ్బీర్ అల విమర్శించారు. కాంగ్రెస్ ఎం చేసిందో మీ నాయిన ని అడుగాలని కేటీఆర్‌కు సూచించారు. రాజకీయంగా కేటీఆర్ కాంగ్రెస్ కు జన్మనిచ్చిందని గుర్తు చేశారు. ఏం పీకారు అని మాట్లాడుతున్నరాని.. అదేం భాష అని ప్రశ్నించారు. ప్రతి ఐటీ కంపెనీ నుంచి 30 శాతం కమీషన్ తీసుకుంటున్నారని షబ్బీర్ ఆరోపించారు. కెటిఆర్.. ఎగిరెగిరి పడకు. ఇంకా మీకు 100 రోజుల గడువు మాత్రమే ఉందన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. బీఆర్ఎస్ నుండి ఎవరు పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో కామారెడ్డి తనదేనని, తాను గెలవడం పక్కా అన్నారు. తాను చెప్పకపోయినప్పటికీ ఇక్కడి ప్రజలు కేటీఆర్‌ను నిలదీశారన్నారు. ఎన్నికలు దగ్గరపడుతున్న కొద్దీ తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ నాయకులను తరిమి కొట్టకపోతే నా పేరు షబ్బీర్ అలీయే కాదన్నారు. కామారెడ్డికి తాను ఏం చేశానో కేసీఆర్‌ను అడిగితే చెబుతాడన్నారు. కౌన్సిల్‌లోనే తన గురించి కేసీఆర్ ఏం చెప్పారో కేటీఆర్ తెలుసుకొని మాట్లాడాలన్నారు.

ఓఆర్ఆర్ చంద్రబాబు నాయుడు 62 కిలోమీటర్ల 6 లైన్ ల రోడ్ ప్రపోజల్ చేస్తే.. కాంగ్రెస్ 12 లైన్స్ తో 159 కిలోమీటర్లు చేశామన్నారు. ఎక్కడ సిగ్నల్ లేకుండా దేశంలోనే పెద్ద రింగ్ రోడ్డు నిర్మించామనని గుర్తు చేశారు. మేము ఓఆర్ఆర్ తెస్తే మీరు సంపాదించుకుంటున్నారని మండిపడ్డారు. తెలంగాణ భూములు అమ్మి ఎం చేయాలనుకుంటున్నారని షబ్బీర్ అలీ ప్రశ్నించారు. కేటీఆర్ 100 రోజుల తరువాత ఎక్కడ ఉంటావో చూసుకోవాలని సలహా ఇచ్చారు. కేటీఆర్ తగిన బుద్ధి త్వరలోనే చెబుతామన్నారు. కెసిఆర్ కామారెడ్డి వస్తా అంటే ఎవరు వద్దనడం లేదు... తాను కాంగ్రెస్ లో కామారెడ్డి నుండే పోటీ చేస్తున్నానని ప్రకటించారు. మేము చూసుకుందాం అంటే ప్రజలు మీ తోలు తీస్తారన్నారు. 9 సంవత్సరాలుగా ఎం చేయలేదన్నారు. 2015 లో లక్షా, గత సంవత్సరం మైనార్టీ ల కోసం 2 లక్షల అప్లికేషన్లు వచ్చాయి.. ఇప్పుడు ఒక్కో నియోజకవర్గనికి 120 మందికి ఇస్తే బీదరికం పోతుందా అని ప్రశ్నించారు. ఇచ్చేది కూడా బీఆర్ఎస్ నేతలేక ఇస్తున్నారన్నారు.

# అరెస్ట్ నంబర్ 99.

హైదరాబాద్, విశాల భారతి:

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్షా పత్రాల లీకేజీ కేసులో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) దూకుడు కొనసాగిస్తోంది. ఈ ఘటనకు సంబంధించి లింకులున్నట్టుగా అనుమానిస్తూ మరో ముగ్గురిని సిట్ అరెస్ట్ చేసింది. వీరిని ప్రధాన నిందితుడు ప్రవీణ్ కు బంధువులుగా గుర్తించి అదుపులోకి తీసుకుంది. తాజాగా అరెస్ట్ చేసిన ముగ్గురితో.. పేపర్ లీకేజ్ కేసుకు సంబంధించి సిట్ సంకెళ్లు వేసిన వారి సంఖ్య 99కు చేరింది. పేపర్లను పరీక్షకు ముందే బయటికి వెళ్లేలా చేసిన స్కామ్ లో.. ప్రవీణ్ కు బంధువులైన ఈ ముగ్గురూ సహకరించిన తీరుపై సిట్ తగిన ఆధారాలు సేకరించినట్టుగా తెలుస్తోంది. పక్కాగా సమాచారాన్ని ఖరారు చేసుకున్నాకే వీళ్లను కటకటాల వెనక్కు పంపించి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్టుగా సమాచారం. ఈ కేసులో ఏ2గా ఉన్న రాజశేఖర్ రెడ్డికి మరోసారి కోర్టులో భంగపాటు ఎదురైంది. ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఇప్పటికే మూడు సార్లు రాజశేఖర్ రెడ్డి వేసిన బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురి కాగా.. నాలుగోసారి కూడా ఆయనకు చుక్కెదురైంది. గత ఏడాది టీఎస్పీఎస్సీ పరీక్షా పత్రాలు లీక్ అయిన ఘటనకు సంబంధించి సిట్ ఆధ్వర్యంలో దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే కొన్ని నియామక పరీక్షలను సర్వీస్ కమిషన్ వాయిదా వేసింది. తర్వాత పూర్తి భద్రతా ఏర్పాట్లతో వాటిని రీ షెడ్యూల్ చేసి నిర్వహించాల్సి వచ్చింది. ఇంతటి ప్రభావాన్ని కలగజేసిన ఈ పేపర్ లీకేజ్ వ్యవహారంలో ఇంకెంతమంది అరెస్ట్ అవుతారు.. విచారణ లో తేలాల్సివుంది.





రక్షణశాఖ స్టాండింగ్ కమిటీలోకి

# రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి

స్టాండింగ్ కమిటీకి ఎంపికయ్యారు. మార్చి నెలలో సభ్యత్వం కోల్పోకముందు కూడా రాహుల్ ఈ కమిటీలోనే సభ్యుడిగా ఉన్నారు. ఇందులోకి కాంగ్రెస్ ఎంపీ అమర్ సింగ్ కూడా నామినేట్ అయినట్లు లోక్‌సభ బులిటెన్ వెల్లడించింది. లోక్‌సభకు కొత్తగా ఎన్నికైన ఆమ్‌ఆద్మీ తరఫు ఎంపీ సుశీల్ కుమార్ రింకూ.. వ్యవసాయం, పశుసంవర్ధక, ఫుడ్ ప్రాసెసింగ్ స్టాండింగ్ కమిటీకి ఎంపికయ్యారు. ఇటీవల జలంధర్ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో రింకూ ఎన్నికయ్యారు. ఇక మార్చి నెలలో లోక్‌సభ సభ్యత్వం తిరిగి పొందిన ఎన్సీపీ ఎంపీ ఫైజల్ మొహమ్మద్.. వినియోగదారుల వ్యవహారాల స్టాండింగ్ కమిటీకి నామినేట్ అయ్యారు.



చేతివృత్తుదారులందరికీ సబ్సిడీపై

# రూ.2 లక్షలు లోన్..

మొదటిపేజీ తరువాయి

కేంద్రం.. ఇందుకు రూ. 77,613 కోట్లు వెచ్చించనున్నట్లు తెలిపింది. 3లక్షల కంటే ఎక్కువ జనాభా ఉన్న నగరాలకు.. ఈ బస్సులు కేటాయిస్తామని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకుర్ తెలిపారు.

**డిజిటల్ ఇండియా పథకం కొనసాగింపు..**

మరోవైపు డిజిటల్ ఇండియా పథకం కొనసాగింపునకు.. రూ.14,903 కోట్లు కేటాయించింది. ఈ పథకం కింద 5.25 లక్షల మంది ఐటీ ఉద్యోగుల నైపుణ్యాలు మెరుగుపర్చేందుకు, 2.65 లక్షల మంది ఐటీ సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు నిధులు వెచ్చించనున్నారు.





# చిట్యాల మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే చిరుమర్తి
- బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని మూడోసారి ఆదరించాలి
- రూ. 2 కోట్లతో ధోభీ ఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన



**చిట్యాల,విశాలభారతి:** చిట్యాల మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేస్తానని నకిరేకల్ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల పట్టణం 2వ వార్డు సుందరయ్య నగర్ లో మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి అధ్వర్యంలో రెండు కోట్ల రూపాయలతో నిర్మించనున్న దోపి ఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 4 మిషనరీలతో దోబీగాట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. అన్నారు. గత 3 సం.లలో చిట్యాల మున్సిపాలిటీ లో అద్వితీయమైన మార్పులు జరిగాయని అన్నారు. కుల వృత్తుల పై ఆధారపడ్డ వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం బిసి రుణాల పేరుతో అధుకుంటున్నారని అన్నారు. గతం లో ఏమి పనులు చేయనోల్లు ఈరోజు ప్రజల్లో విద్వేషాలను సృష్టిస్తున్నారని అన్నారు. అనంతరం నూతనం గా నిర్మిస్తున్న వైకుంఠ ధామం నిర్మాణ పనులను పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత కాంట్రాక్టర్ల ని,మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అనంతరం చిట్యాల పురపాలక సంఘ కార్యాలయంలో 201819 ఆర్థిక సంవత్సరం సంబంధిత ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 5గురు లబ్ధిదారుల కు రూ.1లక్ష 75వేలు అలాగే మైనారిటీ లకి మంజూరైన ముగ్గురు లబ్ధిదారులకు రూ 4 లక్షల రూపాయల చెక్కులని అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, కమిషనర్ మందడి రామ దుర్గారెడ్డి, స్థానిక కౌన్సిలర్ కోనేటి కృష్ణ,బెల్లి సత్తయ్య, సింగిల్ విండో వైస్ చైర్మన్ మెండే సైదులు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు ఆవుల ఐలయ్య, కార్యదర్శి మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య కో ఆప్షన్ సభ్యులు వివిధ హోదాలలో ఉన్న నాయకులు అధికారులు, రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు

# కదన దిక్సూచి కవిత

- విజయం దిశగా దిశా నిర్దేశం ..
- మెట్టెంటి నుంచే జంగ్ సైరన్
- విజయ యాత్రను తలపించిన కవిత పాదయాత్ర



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ జిల్లాలో రాబోయే శాసనసభ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో విజయ పతాకాన్ని ఎగురవేయడమే లక్ష్యంగా ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జంగ్ సైరన్ మోగించారు. నిజామాబాద్ జిల్లాలో విజయాలను ఖరారు చేసే దిశగా ఇటీవలే కవిత పూర్తి బాధ్యతను స్వీకరించి ఎన్నికల పోరు సన్నాహాలను ప్రారంభించా రు. ఇందులో భాగంగా నియోజకవర్గాల వారీగా లోతైన సమీక్షలు మొదలుపెట్టారు. లోటుపాట్లను గుర్తించి పార్టీ శ్రేణులకు నాయకులకు దిశా నిర్దేశం చేశారు. పార్టీ క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కధన సైనికులుగా పనిచేసేలా కర్తవ్య బాధ్యతలు నిర్ణయించారు. బూత్ లెవెల్ నుంచే విజయమే లక్ష్యంగా ముందుకు సాగేలా శ్రేణులను క్రియాశీలం చేశారు. కవిత ఆరంభించిన ఈ కృషి బుధవారం బోధన్ నియోజకవర్గంలో ఆమె నిర్వహించిన పాదయాత్ర లో సఫలమై కనిపించింది. ఆమె పూరించిన విజయ శంఖారావం ఆరంభం లోనే ఈ పాదయాత్ర కు ప్రజల నుంచి వచ్చిన స్పందన విజయ యాత్రను తలపించింది అనడం అతిశయోక్తి కాదు.

జిల్లా కోడలిగా తన మెట్టింటి నుంచే ఈ సమర యాత్ర ప్రారంభించి జిల్లా టిఆర్ఎస్ విజయాలు తన బాధ్యత అని చాటారు. బోధన్ నియోజకవర్గంలో సాధించబోయే మెజారిటీ రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో ఉండాలని కవిత పిలుపునివ్వడం ఘనమైన విజయాలనే ఆవిష్కరించాలని ఆమె సంకల్పాన్ని ప్రతిబింబించింది. జిల్లాలో అన్ని స్థానాల్లో గెలుపునకు కల్వకుంట్ల కవిత విజయ దిక్సూచిగా నిలువను న్నారని బుధవారం బోధన్ నియోజకవర్గంలో నిర్వహించిన పాదయాత్ర స్పష్టంగా చాటి చెప్పింది.





# వేలిముద్ర విధానాన్ని రద్దు చేయాలి

**మహబూబాబాద్, విశాల భారతి:** తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐ.ఎఫ్.టి.యు) రాష్ట్ర కమిటీ సమావేశం మహబాద్ జిల్లా కేంద్రంలో ఐ.ఎఫ్.టి.యు జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం( ఐ.ఎఫ్.టి.యు అనుబంధం) రాష్ట్ర అధ్యక్షులు గంటా నాగయ్య మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో భవన నిర్మాణ కార్మికులు లేబర్ గుర్తింపు కార్డు పొందాలన్న, రెన్యువల్ చేయలన్న మీ సేవ ఆన్ లైన్ లో వేలి ముద్ర వేయాలనే నిబంధనలు కార్మికులకు ఇబ్బందికరంగా మారిందని అవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని రద్దుచేసి పాత విధానాన్ని కొనసాగింపు చేయాలని కోరారు. అధికారుల ఇలాంటి అనాలోచిత చర్యలు కార్మికులకు నష్టకరంగా ఉన్నాయని అన్నారు. మోడీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 29న హైదరాబాదులో ఇందిరాపార్క్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు దీనికి కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కామల్ల నవీన్ రాష్ట్ర నాయకులు జబ్బార్, లక్ష్మయ్య, దేశోజు మధు, కామల్ల శ్రీను, ఇంజా శ్రీనివాస్ తిరుపతి, వీరాస్వామి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు



# నియోజకవర్గ సమస్యలపై జిల్లా కలెక్టర్ తో చర్చించిన పోదెం వీరయ్య

**భద్రాద్రి కొత్తగూడెం,విశాల భారతి:** భద్రాచలం శాసనసభ్యులు పొదెం వీరయ్య నియోజకవర్గం సమస్యలపై బుధవారం భద్రాద్రి జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక ఆలా ని మర్యాదపూర్వకంగా కలిశారు. భద్రాచలం నియోజకవర్గ సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం గోదావరి నది వరదల వలన భద్రాచల ప్రాంతం తీవ్రంగా నష్టపోతుందని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గోదావరి వరద నీరు భద్రాచలం పట్టణంలోకి ప్రవేశించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని నూతన మోటర్లు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు.అంతర్గత రహదారులకు డ్రైనేజీలకు మరియు మౌలిక వస్తువులకు నిధులు మంజూరు చేయాలని, నిర్మాణం పూర్తయిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే అందించాలని అయన కోరారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో డాక్టర్లు కొరత తీవ్రంగా వేధిస్తుందని వెంటనే డాక్టర్లు నియమించి నాలుగు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన భద్రాచలం ఆసుపత్రిలో వైద్య సేవలకు ఆటంకం కలగకుండా చూడాలని వారు తెలిపారు.చర్ల మండలం బత్తినపల్లి గ్రామంలో మంజూరయిన 98 మంది అసైన్మెంట్ పట్టాదారు పాసు పుస్తకాలను వెంటనే లబ్ధిదారులకు అందించే విధంగా చర్యలు చేపట్టాలని అదేవిధంగా దుమ్ముగూడెం మండలం ముల్కనాపల్లి గ్రామం గిరిజనులకు వారు సాగులో ఉన్న ప్రభుత్వ భూమికి పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని అన్నారు.భద్రాచలం పట్టణం ఎస్సీ కమ్యూనిటీ హాలు నిర్మాణమును త్వరితగతిన పూర్తి చేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ను కోరారు. భద్రాచలం గ్రామపంచాయతీ విభజన చట్టం గురించి కూలం కుశంగా చర్చించారు.శాసనసభ్యులు వినతులకు జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి వీటన్నిటిపై వెంటనే చర్యలు చేపడతామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సరెళ్ల నరేష్ , టీపీసీసీ సభ్యులు బుడగం శ్రీనివాస్, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు చింతిర్యాల రవి కుమార్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బోగాల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా మైనారిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఖాన్, సరెళ్ల వెంకటేష్, రవి , బాబాజీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# చిన్నారులకు దిక్కెవరు..

**మహబూబాబాద్, విశాల భారతి:** చిన్నారి పసి మొగ్గలు తమ తల్లి తండ్రులను కోల్పోవడం బాధాకరం అని బహుజన్ సమాజ్ పార్టీ డోర్నకల్ నియోజకవర్గ మహిళ కన్వీనర్ గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ తీవ్ర విచారాన్ని వ్యక్తం చేశారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండలంలోని గాలివారిగూడెం గ్రామంలో ఇటీవల తల్లి, తండ్రులను కోల్పోయిన చిన్నారులు ఏడెల్లి లోహిత (06), ఏడెల్లి జాహ్నవి (04), ఏడెల్లి అశ్విన్ (02) లను గుగులోత్ పార్వతి రమేష్ నాయక్ తమ భర్త, పిల్లలతో కలిసి పరమర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలక్రితం చిన్నారుల తల్లి ఏడెల్లి ఉమా (28) మరిపెడ ప్రభుత్వ హాస్పిటల్ లొ కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మృతి చెందిందని నేటికీ బిఆరెస్ పాలకులు, ప్రభుత్వ అధికారులు నష్టపరిహారం కింద ఐదు ఎకరాల భూమి, భర్తకు ప్రభుత్వ ఉద్యోగం, డబల్ బెడ్రూమ్ ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చి వాటిని అందించే క్రమంలో తీవ్ర జాప్యం చేసిన కారణంగా కుటుంబం గడవక, పిల్లల పోషణ, సంరక్షణ భారంగా మారి తీవ్ర మనోవేదనతో చిన్నారుల తండ్రి ఏడెల్లి ఉపేందర్ (30) గత కొన్ని రోజుల క్రితం మరణించాడని ఇవి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యలుగా భావిస్తున్నామన్నారు. తక్షణమే ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి చిన్నారులకు, చిన్నారుల కుటుంబానికి న్యాయం చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లైవ్ బంజారా రాష్ట్ర ముఖ్య సమన్వయ కర్త గుగులోత్ రమేష్ నాయక్, బిఎస్పీ జిల్లా కార్యదర్శి, డోర్నకల్ అసెంబ్లీ ఇంచార్జ్ ఐనాల పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల హక్కులు,ఆత్మ గౌరవం కోసం పని చేసేది



- భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఒక్కటే
- భారత వికలాంగుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షులు కుర్ర గోపి యాదవ్

**గరిడేపల్లి,విశాలభారతి:** వికలాంగుల హక్కులు, ఆత్మ గౌరవం కోసం పోరాటం చేసేది భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి ఒక్కటే అని సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు కుర్ర గోపి యాదవ్ అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి ఒక్క వికలాంగుడు ఎవరో వస్తారు,ఏదో వస్తారు అని ఆలోచించకుండా తమ హక్కులు, ఆత్మ గౌరవం,రాజ్యాధికారం కోసం పోరాడే భారత వికలాంగుల పరిరక్షణ సమితి తో కలిసి పోరాటం చేయాలన్నారు. భారత వికలాంగుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దే రాజేష్ ఆదేశాల మేరకు గురువారం మండల అధ్యక్షుని ఎన్నిక మండల కేంద్రంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు.మండల అధ్యక్ష ఎన్నిక కోసం మండల పరిధిలోని 32 గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్క వికలాంగులు తరలిరావాలని అన్నారు.అదే విధంగా మిర్యాలగూడ బస్ డిపో మేనేజర్ సహకారంతో బస్ పాస్ మేళా కూడా నిర్వహించటం జరుగుతుందనీ, కావున బస్ పాస్ కావలసిన వికలాంగులు అందరూ సదరం సర్టిఫికెట్ ,ఆధార్ కార్డు,2పాస్ ఫోటోలు తీసుకొని మన ఎస్బిఐ బ్యాంక్ వెనక వైపు రాగలరనీ అన్నారు



# ఐజేయు నుండి టియుడబ్ల్యూజె 143 యూనియన్ కి భారీ చేరికలు

**కోదాడ,విశాలభారతి:** ఐజేయు నుండి టియుడబ్ల్యూజె 143 యూనియన్ కి భారీగా చేరినారు జర్నలిస్టుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక యూనియన్ టిడబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ మాత్రమేనని జిల్లా ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్ అధ్యక్షులు వంగవీటి శ్రీనివాస్ రావు లు అన్నారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్(ఐజేయు) సంఘం నుండి సభ్యత్వాన్ని రద్దు చేసుకొని, తెలంగాణ యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ టి డబ్ల్యూజే హెచ్ 143 యూనియన్ లోకి వచ్చిన సీనియర్ జర్నలిస్ట్ పిడమర్తి గాంధీ, గంధం రాము, వేణుగోపాలు, చలిగంటి దామోదర్ లు జిల్లా ప్రెస్ క్లబ్ జిల్లా అధ్యక్షులు కారింగుల అంజన్ గౌడ్, అధ్యక్షులు వంగవీటి శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వ వారధిగా ఉంటూ నిత్యం జర్నలిస్టు సమస్యలపై, ఇండ్ల స్థలలకై పోరాడుతున్న యూనియన్ టి డబ్ల్యూ జే హెచ్ 143 మాత్రమే అన్నారు. యూనియన్ యొక్క విధి విధానాలకి ఆకర్షితుడై యూనియన్ లో సభ్యత్వం తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతనంగా సభ్యత్వం తీసుకున్న గాంధీ, రాము, వేణుగోపాలు, దామోదర్ లకు పలువురు యూనియన్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గం ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులు సీనియర్ జర్నలిస్టు పడిశాల రఘు, టీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షులు సంపత్, టీయూడబ్ల్యూజే హెచ్ 143 నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మాతంగి సురేష్, ఎలక్ట్రానిక్ మీడియా గౌరవ అధ్యక్షులు వెన్నబోయిన పూర్ణచందర్ రావు, ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మరికంటి లక్ష్మణ్, ఎలక్ట్రాన్ మీడియా ఉపాధ్యక్షులు చింతలపటి సురేష్, కొలిచలం నరేష్, హారిష్ తదితరులు పాల్గొన్నారు.



# దుగ్యాల శ్రీనివాసరావు సేవలు చిరస్మరణీయం

**తొర్రూరు,విశాలభారతి:** దుగ్యాల శ్రీనివాసరావు సేవలు చిరస్మరణీయమని రామ సహాయం కిషోర్ రెడ్డి జిల్లా రైతు సమన్వయ సమితి సభ్యులు అన్నారు. బుదవారం ఆయన జయంతి సందర్భంగా స్థానిక విశ్రాంతిభవనం ముందు పాలకుర్తి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు దుగ్యాల శ్రీనివాసరావు జయంతిని పురస్కరించుకొని మహా అన్నదాన కార్యక్రమాన్ని దుగ్యాల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామ సహాయం కిషోర్ రెడ్డి జిల్లా రైతు సమన్వయ సభ్యులు పాల్గొని వారు శాసనసభ్యులుగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో అన్ని సామాజిక వర్గాలను మరియు కార్యకర్తకు అండగా ఉంటూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లారని అన్నారు. తొర్రూర్ లో డిగ్రీ కళాశాల ఏర్పాటు నాణ్యమైన కరెంటును రైతులకు అందించాలనే ఉద్దేశంతో ఎక్కువ సంఖ్యలో సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసి చెన్నూరు నియోజకవర్గం లో విద్యాభివృద్ధి కోసం చెట్ల కింద బడులు నిర్వహించోదని అనేక అదనపు తరగతి గదులు నిర్మించి విద్యా అభ్యున్నతికి పాల్పడినాడు వారు భౌతికంగా మన మధ్య లేకున్నా వారి యొక్క సేవలు ఈ నియోజకవర్గానికి ఎంతో ఉపయోగపడ్డాయని తెలియజేసినారు ఈ కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకులు వెల్తూరి మల్లేశం మిట్టగోల లక్ష్మణ్ శ్రీను రాజు కిరణ్ వేణు శ్రీనాథ్ మరియు దుగ్యాల అభిమానులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు



# నిజమైన సుపరిపాలన అందించిన ప్రధాని అటల్ బిహారీ వాజపేయి

**తొర్రూరు,విశాలభారతి:** భారత మాజీ ప్రధాని, భారత రత్న, అటల్ బిహారీ వాజపేయి వర్థంతి సందర్భంగా బిజెపి తొర్రూరు శాఖ అధ్యక్షుడు పల్లె కుమార్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు మరియు బ్రెడ్ పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి లాంటి అత్యున్నత పదవిలో ఉండి కూడా కనీసం సొంత ఇల్లు కూడా లేనటువంటి నిఖార్సయిన రాజకీయ నాయకుడు అటల్ బిహారీ వాజపేయి అని తెలిపారు. విలువలతో కూడిన రాజకీయాలకు చిరునామాగా వాజ్ పాయ్ చరిత్రలో నిలిచిపోయారని తెలిపారు.భారత ప్రధాని గా వాజ్ పాయ్ దేశంలో అభివృద్ధి ని పరుగులు పెట్టించారు అని తెలిపారు. టెలీ కమ్యూనికేషన్ రంగంలో అనేక విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి సెల్ ఫోన్,ఇంటర్ నెట్ వంటి వాటిని ఈదేశంలో ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు. ఆయన సేవలు చిరస్మరణీయం అని తెలిపారు .ఈ కార్యక్రమంలో బిజెపి పాలకుర్తి నియోజకవర్గ కన్వీనర్ పూసాల శ్రీమాన్, జిల్లా కార్యదర్శి పరుపాటి రాం మోహన్ రెడ్డి,జలగం వెంకన్న, పైండ్ల రాజేష్,సి.హెచ్.విజయ్ కుమార్,నూకల నవీన్,పప్పుశెట్టి సంతోష్, కుమ్మరి కుంట్ల శివ, తదితరులు పాల్గొన్నారు.

# సంప్రదాయ వేడుకలకు వేదిక తెలంగాణ

- సంస్కృతి ప్రతిబింబించేలా సంబరాలు
- తీజ్ ఉత్సవాల్లో చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్



హనుమకొండ,విశాలభారతి: సంస్కృతి సంప్రదాయ వేడుకలకు తెలంగాణ వేదికగా నిలుస్తుందని చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. హన్మకొండ రాంనగర్ లోని బంజారా కాలనీలో గిరిజన సంప్రదాయ పండుగ తీజ్ ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజన పెద్దలు చీఫ్ విప్ కు ఘన స్వాగతం పలికారు. ఉత్సవాల్లో పాల్గొన్న చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ గారు గిరిజనుల సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చీఫ్ విప్ గారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సబ్బండ వర్గాలు తమ సంస్కృతి సంప్రదాయాలకు పెద్దపీట వేస్తున్నారని, మన సంస్కృతి ప్రతిబింబించేలా సంబరాలు జరుపుకుంటున్నారని ఆయన అన్నారు. తీజ్ ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సుగునకర్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు మరియు తదితరులు పాల్గొన్నారు..



## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

- **ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
- **సొంత నిధులతో ఇస్నాపూర్ మైనార్టీ పాఠశాలకు మైక్ సెట్, క్రీడా సామాగ్రి పంపిణీ**

**పటాన్ చెరువిశాలభారతి :** సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు రావడంతో పాటు, విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్ చెరు మండలం ఇస్నాపూర్ గ్రామ పరిధిలోగల మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలకు లక్ష రూపాయల సొంత నిధులతో కొనుగోలు చేసిన మైక్ సెట్, క్రీడా పరికరాలు, కుర్చీలను బుధవారం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తూ, నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటుచేసి ఒక్కో విద్యార్థి పై లక్షా 20 వేల రూపాయల వ్యయం చేస్తోందని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ కంపెనీలలో ఉద్యోగాలు సాధిస్తున్నారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, గూడెం మధుసూదన్ రెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.







## గీతంలో పీఎక్స్ఆర్డీ ల్యాబ్ ప్రారంభం

**దాని పనితీరు, ఉపయోగాలను వివరించిన కెమిన్ టెక్ సీఈవో డాక్టర్ శర్మ**

**పటాన్‌చెరువిశాలభారతి:** గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లో పౌడర్ ఎక్స్‌రే డిఫ్రాక్షన్ (పీఎక్స్ఆర్డీ) ప్రయోగశాలను బుధవారం కెమిన్ టెక్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ జేఏఆర్పీ శర్మ ప్రారంభించారు. క్రిస్టల్లోగ్రఫీ ఇండియా సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ ల్యాబ్ ప్రారంభోత్సవంలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రతాప్ కొల్లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీఎక్స్ఆర్డీ వినియోగాలు అనే అంశంపై నిర్వహించిన ఒకరోజు జాతీయ కార్యశాలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శర్మ ఆ ప్రయోగశాల ప్రాముఖ్యత, తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి వివరించారు. ఎక్స్‌రే విస్తృతశ్రేణి ఉపయోగాలను కలిగి ఉందని, దీనిని వివిధ అనువర్తనాలలో వినియోగించవచ్చని చెప్పారు. ఎలక్ట్రానిక్ బీమ్ ని ఏ మూలాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారో, ఆ మూలం ఆధారంగా ఎక్స్‌కిరణాలు బయటకు వస్తాయన్నారు. ఈ ప్రయోగశాలను తలుపులు మూశాకే వినియోగించాలని, ఇది అధిక ఉష్ణోగ్రతను విడుదలచేసి త్వరగా వేడెక్కుతుంది కాబట్టి, దానిని చల్లబరచేందుకు ప్రయోగం నిర్వహించినంత సేపూ చల్లటి నీరు ప్రవహిస్తూనే ఉండాలని డాక్టర్ శర్మ స్పష్టీకరించారు. పొరపాటున ఆ ఎక్స్‌రే కిరణాలు చర్మంపై పడితే అది క్యాన్సర్ కు కూడా దారితీసే ప్రమాదం లేకపోలేదని ఆయన హెచ్చరించారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డాక్టర్ ప్రతాప్ పీఎక్స్ఆర్డీ వల్ల ఒనగూడే ప్రయోజనాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. తొలుత, వర్క్ షాప్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ రాంబాబు గుండ్ల ఈ ప్రయోగశాలను పొందడానికి చేసిన కృషిని వివరిస్తూ, సగం ధనాన్ని క్రిస్టల్లోగ్రఫీ ఇండియా వారిచ్చినట్టు చెప్పారు. రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియా బేగం దీనిని స్వాగతిస్తూ, మంచి పరిశోధనా వాతావరణం లభించడం పట్ల హర్షం వెలిబుచ్చారు. వర్క్ షాప్ లక్ష్యాలను కార్యక్రమ నిర్వాహకుడు డాక్టర్ ఎం. సురేంద్రబాబు వివరించగా, డాక్టర్ నరేష్ కుమార్ కటారి, డాక్టర్ ఉమాదేవి ఈ కార్యశాలను సమన్వయం చేశారు.

## వీఆర్ఏ ల పదోన్నతి నియమకాల్లో అవకతవకలు

**మహబూబాబాద్, విశాలభారతి:** కురవి మండలంలో వీ.ఆర్.ఏల పదోన్నతుల విషయంలో కారుణ్య నియామకాల్లో భాగంగా నిబంధనలకు విరుద్ధంగా జరిగిన అవకతవకలు పై జిల్లా రెవిన్యూ అధికారులు, ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి సంబంధిత అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ డిమాండ్ చేశారు. వీ ఆర్ ఏ ల కారుణ్య నియామకాల్లో తల్లి దండ్రులకు వయస్సు దాటకముందే, వారు మరణించక ముందే వారసులకు ఎలాంటి నియమ నిబంధనలు పాటించకుండా గతంలో పని చేసిన తహశీల్దార్ అక్రమంగా కాసుల కోసం కక్కుర్తి పడి నియామక ఆర్డర్లు ఇవ్వడం సిగ్గు చేటని అన్నారు.గత మూడు సంవత్సరాల క్రితం కురవి లో పని చేసిన తహశీల్దార్ ఈ ఆర్డర్లకు అక్రమంగా శ్రీకారం చుట్టారు అని అలా అక్రమ ఆర్డర్లు సృష్టించి కురవి మండల కేంద్రం తో పాటు పలువురు వీఆర్ఏ లు ప్రమోషన్లు పొందినట్లు వారికి సంబంధించిన కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. ఇప్పటికైనా వీఆర్ ఏ ల పదోన్నతి నియామకాల్లో అవకతవకలకు పాల్పడిన వారి పై జిల్లా రెవిన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి వెంటనే సంబంధిత రెవిన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలనీ పేర్కొన్నారు.



## ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలి

**కమిషనర్ సంగారెడ్డి, కౌన్సిలర్ సుజాత మహేందర్ రెడ్డి**

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** బొల్లారం మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు బాలాజీ నగర్ లో బొల్లారం మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి స్థానిక కౌన్సిలర్ గుండ్ల సుజాత మహేందర్ రెడ్డితో కలిసి ఇంటింటికి తిరిగి 6 మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ హరితహారం లో భాగంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని వాటిని సంరక్షించాలని చెట్లు వలన వచ్చే కృత్రిమ వాతావరణాన్ని ఆస్వాదించాలని పేర్కొన్నారు. మేనేజర్ మల్లికార్జున్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ వినోద్ కుమార్, రఘురాం రెడ్డి, ఆర్ పి కవిత పాల్గొన్నారు.



## ఆదర్శవంతంగా భారతినగర్ అభివృద్ధి

**కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి**

**పటాన్ చెరువిశాలభారతి :** అందరి సహకారంతో భారతి నగర్ డివిజన్ ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నట్టు కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజి కాలనీలో సుమారు 32 లక్షలతో ప్రహరీ గోడ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కార్పొరేటర్ సింధు మాట్లాడుతూ ఈ ప్రహరీ గోడ నిర్మాణంతో మహిళ భవన్, పాఠశాల విద్యార్థులకు భద్రత ఉండడంతో పాటు అక్రమ నిర్మాణాలకు అడ్డు పడుతుంది అని అన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. ప్రతి కాలనీలో ప్రజలకు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ చంద్రశేఖర్, కాలనీ సొసైటీ అధ్యక్షుడు రాజు, బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షురాలు రాణి యాదవ్, శ్రీలత, స్వరూప, శ్రీదేవి, రామ్ లక్ష్మి, జెబున్, స్వర్ణ వాని, శ్రీలక్ష్మి, విజయ, భారతి, దేవి, సెక్రెటరీ రాములు, డైరెక్టర్లు రాధాకృష్ణ, అన్నపూర్ణమ్మ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



## డబుల్ బెడ్ లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామసభ

**బాల్కొండ,విశాలభారతి:**బాల్కొండ నియోజకవర్గం భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయం దగ్గర డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ కోసం అధికారులు గ్రామ సభ నిర్వహించారు.52 ఇండ్ల గురించి బుధవారం 73 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించి డ్రా పద్దతి ద్వారా 52 మందిని ఎంపిక చేశారు. భీమ్‌గల్ పట్టణంలో మొత్తం 288 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు.అందులో ఇండ్ల నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన వారికి 12 ఇండ్లను కేటాయించారు.మిగిత 276 ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను అధికారులు సర్వే చేసి 233 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి 09 మందిని తొలిగించినట్ల వెల్లడించారు.అర్హులకు కాకుండా అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఎలా ఇస్తారని అక్కడికి వచ్చిన గ్రామస్తులు అధికారుతో కొద్ది సేపు వాగ్వాదానికి దిగారు.అధికారులు,నాయకులు సర్దిచెప్పాడంతో శాంతించారు. అనర్హులుగా గుర్తించిన జాబితాలో ఇంకా ఏమైనా పొరపాట్లు జరిగాయని భావిస్తే వారు దరఖాస్తులు చేసుకుంటే తిరిగి పరిశీలిస్తామని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఆర్డీవో వినోద్ కుమార్, తహశీల్దార్ వెంకట రమణ,డిప్యూటీ తహశీల్దార్ రాజశేఖర్,మున్సిపల్ చైర్మన్ కన్నె ప్రేమలత సురేందర్,పట్టణ అధ్యక్షుడు మల్లెల లక్ష్మణ్, కౌన్సిలర్లు బోదిరే నర్సయ్య,సతీష్,నాయకులు ప్రసాద్,మూత లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా మాజీ ప్రధాని వాజ్పేయి వర్ధంతి వేడుకలు

**బొల్లారం మున్సిపాలిటీ, విశాల భారతి:** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పాయ్ వర్ధంతి కార్యక్రమాన్ని బొల్లారం బిజెపి అధ్యక్షుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటల్ బిహారి వాజ్ పేయి సేవలు దేశానికి స్లాగనీయమని ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా సీనియర్ నాయకులు రవీందర్ రెడ్డి, మహిళా నేతలు మేఘనా రెడ్డి, రోహిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ యోద్యమ ఆకాంక్షల సాధన కోసం పోరాడుదాం

**బోడుప్పల్,విశాలభారతి:**బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అంబేద్కర్ విగ్రహం వద్ద భారత్ బచావో కరపత్రం విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ. గత సంవత్సరం 2022 నవంబర్ 19,20,తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భారత్ బచావో ప్రారంభం సదస్సు అనేక రాష్ట్రాల పరిధిలో విజయవంతంగా జరుపుకున్నాం. ఇది మన సమాజంలోని ప్రజలందరికీ స్ఫూర్తిని కలిగించింది, అంతేకాదు నేటి కాలపు అవసరమైన ఉద్యమంగా ప్రజాపక్ష మేధావులందరూ ప్రశ్నిస్తున్నారు. ఆ తర్వాత దీన్ని విస్తృత అవగాహన కోసం దేశ వ్యాపితం మైన మేధావులను సమీకరించి దఫ దఫాలుగా చర్చించి భారత్ బచావో అవగాహన అభివృద్ధి చేయడం జరిగింది. ఆ తర్వాత రాష్ట్ర సదస్సులు జిల్లా సదస్సులు ఢిల్లీలో జాతీయ సదస్సు మార్చ్ నెల 11,12 తేదీల్లో జరిగింది. ఇవన్నీ ప్రగతిశీల ప్రజాస్వామ్య పురోగామి శక్తులకు మంచి స్ఫూర్తిని కలిగించాయి. జలియన్ వాలాబాగ్ దుర్ఘటనలో వేలాది ప్రజలు అమరులయ్యారు. లాహోర్, పెషావర్, మీరట్, కాన్పూర్ తదితర కుట్ర కేసులో దేశభక్తులను జైల్లో పాలు చేసి చిత్రహింసలకు గురిచేశారు. ఈ పోరాటాల ఫలితంగా కోట్లాది దేశ ప్రజలందరి త్యాగాల మూలంగా మనకు 1947 ఆగస్టు 15 నా 200 సంవత్సరాల బ్రిటిష్ పాలన పోయి స్వతంత్రం వచ్చింది. 3000 సంవత్సరాలు పైగా శూద్రులకు, దళితులకు, మహిళలకు విద్య, సంపద లేకుండా మనువాద సంస్థ చేసింది. అలా చేయడానికి ధర్మాలు పేరుతో మనుస్మృతి వంటివి రాసి ప్రజలను మానసికంగా బానిసలు చేసి అణచివేశారు. ఈ కార్యక్రమంలో భారత్ బచావో సిటీ కమిటీ నాయకులు ముత్తయ్య, సోమయ్య, సత్యనారాయణ, శ్రీహరి, రాంబాబు, నరసింహ, స్థానిక నాయకులు నాగయ్య, మల్లేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



## అన్ని వర్గాల సంక్షేమం తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం

**ప్రభుత్వ విప్ అరెకాపుడి గాంధీ**

**శేరిలింగంపల్లి, విశాలభారతి:** అన్ని వర్గాల ప్రజల సంక్షమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ అరేకాపూడి గాంధీ అన్నారు. కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండ్ నగర్ కాలనీ శ్రీ విగ్నేశ్వర శెట్టిబలిజ సంక్షేమ సంఘం సభ్యులు పలు సమస్యలు,చేపట్టవలసిన అభివృద్ధి పనులపై ప్రభుత్వ విప్ ఆరెకపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ విగ్నేశ్వర శెట్టిబలిజ సంక్షేమ సంఘంకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని,మీ అందరికి ఎల్లవేళాల అందుబాటులో ఉంటూ మీ సమస్యల పై స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.కాలనీలో రోడ్లు,మంచి నీటి వసతి,వీధి దీపాల వంటి మౌలిక వసతులు కలిపిస్తానని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు సమిష్టిగా కలిసి సంఘం అభివృద్ధికి పాటు పడాలని ఒక ఆదర్శవంతమైన సంఘంగా తీర్చిదిద్దే క్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలిపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు శ్రీనివాస్ చౌదరి,శ్రీ విగ్నేశ్వర శెట్టిబలిజ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ వెంకటేశ్వర రావు,వైస్ ప్రెసిడెంట్ ధనుంజయ్,జనరల్ సెక్రటరీ పెద్దిరాజు,ట్రెజరర్ యేసు బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస రావు,ఎక్షిక్యూటివ్ మెంబెర్స్ గోపాల్ కృష్ణ, రాంబాబు,తదితరులు పాల్గొన్నారు.



## దైద రవీందర్ నే ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించాలి

**రవీందర్ కి మద్దతుగా పలు గ్రామాల నాయకుల తీర్మానం**

**చిట్యాల,విశాలభారతి:**వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా దైద రవీందర్ నే ప్రకటించాలని చిట్యాల మండలం వెలిమినేడు , బొంగోని చెర్వు , పిట్టంపల్లి , పేరిపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. వెలిమినేడు గ్రామం శివమ్ గార్డెన్లో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ ఈ సమావేశంలో రాబోయే ఎన్నికల్లో నకిరేకల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ప్రజల, కార్యకర్తల అభీష్టం మేరకు ఇవ్వాలని తీర్మానం చేస్తూ 5 సంవత్సరాల నుండి కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ , నిత్యం ప్రజల్లోనే ఉంటూ పేదలకు, కార్యకర్తలకు ఆర్థిక సహాయం చేస్తూ పార్టీ కార్యక్రమాలు చేస్తూ పార్టీని బలోపేతం చేసిన దైద రవీందర్ కి నకిరేకల్ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించి , యం.ఎల్.ఏ అభ్యర్థిగా ప్రకటించాలని తీర్మానం చేశామని తీర్మానం కాపీలను పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డికి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి ఏఐసీసీ ప్రతినిధులకు పంపడం జరుగుతుందని అన్నారు. బొంగోని చెర్వు సర్పంచ్ గ్రామ శాఖ అధ్యక్షుడు సామిడి మోహన్ రెడ్డి , పిఎసిఎస్ వైస్ ఛైర్మన్ బొంతల అంజిరెడ్డి , జిల్లా కాంగ్రెస్ నాయకులు కొంపెల్లి వెంకట్ రెడ్డి , వెలిమినేడు గ్రామ శాఖ అధ్యక్షుడు సుర్కంటి సత్తిరెడ్డి, చీమల వీరేశం, మేడి కృష్ణ, అంది రాములు, పేరిపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు జినుకుంట్ల నాగరాజు పాల్గొన్నారు.



## తెలంగాణలో బీఆర్ఎస్‌కు తిరుగులేదు

- **కొండాపూర్ కార్పొరేటర్ హమీద్ పటేల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన బీజేపీ,కాంగ్రెస్,కార్యకర్తలు.**

**శేరిలింగంపల్లి,విశాలభారతి:** బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలకు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నరని కార్పొరేటర్ హమీద్ పటేల్ అన్నారు. బుధవారం కొండాపూర్ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ హమీద్ పటేల్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నరసింహ సాగర్ ఆధ్వర్యంలో బీజేపీ,కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు నాయకులు, మహిళా,కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు.ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు చెప్పారు.కార్పొరేటర్ మాట్లాడుతూ,సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లి,దేశంలోని మిగతా రాష్ట్రాలకు ఆదర్శవంతంగా తీర్చిదిద్దటం తెలంగాణ రాష్ట్ర ప్రజలు అదృష్టమన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధికి ఎమ్మెల్యే అహర్నిశలు శ్రమించి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నారని అన్నారు. ఎమ్మెల్యే అందుబాటులో ఉంటూ ప్రతి ఒక్క అవసరానికి నేనున్న అనే నమ్మకం కలిగేలా అభివృద్ధి పనులను చేయిస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజలలో ఉన్న నమ్మకం ఎప్పటికి పోదు అని,ఆ నమ్మకం నిలబడే విధంగా అభివృద్ధి తెలంగాణ కోసం సీఎం కేసీఆర్ గారు ఎంతో శ్రమిస్తున్నారని కార్పొరేటర్ హమీద్ పటేల్ గారు అన్నారు.బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మోడల నరసింహ సాగర్,రామకృష్ణ, స్వామి సాగర్,చందర్, మంజుల,పద్మ,నస్రీన్ బేగం, కవిత,సరస్వతి,స్పందన, అస్మాన్ బేగం,రజిత,లింగమ్మ, సంగీత,వెంకటేష్,స్టాలిన్, యాదగిరి,తదితరులు ఉన్నారు.





# మోసపు మాటలు చెప్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అభివృద్ధి పనులు చేస్తూ..ప్రజల మేలు కోరే కేసిఆర్ కు అండగా నిలవాలి
- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి



**బాల్కొండ,విశాలభారతి:** బాల్కొండ మండలంలో బుధవారం పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శంకుస్థాపనలు చేశారు.మండల కేంద్రంలో అంబెడ్కర్ చౌరస్తా నుండి భూమరెడ్డి ఇంటి వరకు సెంట్రల్ లైటింగ్, రోడ్డు వెడల్పు,డివైడర్ పొడిగింపుకు 2 కోట్ల వ్యయం,తెలంగాణ ఫంక్షన్ హాల్ నుండి డబుల్ బెడ్ రూమ్ వరకు వయా సంతమల్లన్న గుడి 2.65 కోట్ల వ్యయంతో నూతన ఆర్అండ్ బి బిటి రోడ్ ఏర్పాటు,బాల్కొండ మండల కేంద్రంలో రింగ్ రోడ్డు నిర్మాణ పనులకు 44.62లక్షల వ్యయంతో శంకుస్థాపన చేశారు.అనంతరం కిసాన్ నగర్ గ్రామంలో 20 లక్షల వ్యయంతో చేపట్టే నూతన గ్రామ పంచాయతీ బిల్డింగ్ నిర్మాణ పనులకు, కిసాన్ నగర్ నుండి జలాల్ పూర్,నాగపూర్ X రోడ్ వరకు డబుల్ రోడ్ గా మార్చుటకు 2.42కోట్ల వ్యయం పనులకు శంకుస్థాపన చేసి బిఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ సీఎం కేసిఆర్ ఆశీర్వాదంతో నియోజకవర్గంలో అభివృద్ది పనుల పరంపర కొనసాగుతుందని అన్నారు. ప్రతీ రోజు కోటి రూపాయలకు తగ్గకుండా ఏదో ఒక అభివృద్ధి పని ప్రారంభిస్తున్నామని తెలిపారు. కానీ ఇది గిట్టని కొంత మంది సోషల్ మీడియాలో కోడి గుడ్డు మీద ఈకలు పీకే ప్రయత్నం చేస్తున్నారనీ మండిపడ్డారు.వారు అధికారంలో ఉన్నప్పుడు నిధులు తేవడం చేతకాలేదు,తాను నిధులు తెచ్చి అభివృద్ధి చేస్తుంటే మాత్రం అడ్డం పడే మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మా కంటే ముందు 10ఏళ్లు కాంగ్రెస్ పార్టీ ఉండే కదా అప్పుడు జరిగిన అభివృద్ధికి కనీసం రెండు రెట్ల అభివృద్ధి ప్రతీ గ్రామంలో ఇప్పుడు జరిగిందనీ, దీనిపై చర్చనే కాదు నేను దేనికైనా సిద్ధమే అని మంత్రి సవాల్ చేశారు.అధికారంలో ఉన్నప్పుడు ఏమీ చేయనీ కాంగ్రెస్ పార్టీ వాళ్ళు,చందమామ తీసుకొచ్చి మీ వొళ్ళో పెడ్తాం అని ఇప్పుడు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేసారు.అబద్ధపు హామీల మాయలో పడిమోసపోవద్దని ప్రజలు ఆలోచన చేయాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మోసపు హామీతో ఓట్లు దండుకున్న అర్వింద్,అభివృద్ధి పనుల కోసం ఒక్క కొబ్బరికాయ అయినా కొట్టిండా..?
బాండ్ పేపర్ రాసిచ్చి రైతులను మోసం చేసి ఎంపీగా గెలిచిన అర్వింద్ అడ్రస్ లేకుండా పోయాడని విమర్శించారు.మోసపు హామీతో రైతుల ఓట్లు దండుకున్న అరవింద్ ఎంపీగా ఈ ప్రాంత అభివృద్ధి,కిసాన్ నగర్ లో అభివృద్ధి కోసం ఒక్క కొబ్బరికాయ అయినా కొట్టిండా అని నిలదీశారు.నన్ను గెలిపిస్తే 5 రోజుల్లో తెస్తా అన్న పసుపు బోర్డు 5 ఏళ్ళైనా దాని ఊసేలేదని, కేసిఆర్,కేటిఆర్,కవిత,ప్రశాంత్ రెడ్డిని తిట్టడానికే ఆయనకు 4ఏళ్లు అయిపోయాయని ఎద్దేవా చేసారు.మోసపు మాటలు చెప్తున్న వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలనీ,అభివృద్ధి పనులు చేస్తూ ప్రజల మేలు కోరే కేసిఆర్ కు అందరూ అండగా నిలవాలని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆరోగ్య శ్రీ ట్రస్ట్ చైర్మన్ గా సుధాకర్ రావు

**అభినందలు తెలిపిన మంత్రులు**

**పాలకుర్తి,విశాలభారతి:** ఆరోగ్య శ్రీ ట్రస్ట్ చైర్మన్ గా మాజీ ఎమ్మెల్యే డా.ఎన్ సుధాకర్ రావుని యమితులయ్యారు. బుధవారం రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖల మంత్రి హరీశ్ రావు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావులను ఆయన కలిసి మర్యాదపూర్వకంగా ధన్యవాదాలు తెలిపారు. ఇరువురు మంత్రులు ఆయనకు శుభాకాంక్షలు తెలియచేసి, సీఎం కేసిఆర్ ఆశయాలను నెరవేర్చేలా ప్రజలకు మరింత సేవ చేసేలా కృషి చేయాలని డా. నెమ్మురుగొమ్ముల సుధాకర్ రావుకి సూచించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రావుతో పాటు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు వంటేరు ప్రతాప్ రెడ్డి, ఆకుల లలిత తదితరులు పాల్గొన్నారు.



# క్షతగాత్రులను పరామర్శించిన గుడిపూడి కోటేశ్వరరావు

**మణుగూరు, విశాలభారతి:** మొండికుంట అడవిలో మంగళవారం జరిగిన ఆటో, కారు యాక్సిడెంట్ లో గాయాలపాలైన బాధితులను దేవరాజ్ ప్రైవేట్ హాస్పిటల్ లో ఎంపిటిసిల ఫోరమ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపూడి కోటేశ్వరరావు పరామర్శించారు. మణుగూరు మండలం కూనవరంకు చెందిన ఆటో డ్రైవర్ మహమ్మద్ ఇజహార్ కు కుడి కాలు, రెండు చోట్ల ఎడమ కాలు, తొంటిలో ఒకచోట చెయ్యి విరిగాయి. ఇజహార్ భార్య సజీదా బేగం కాళ్లకు, చేతులుకు తీవ్ర గాయాలు అయ్యాయి. అలాగే పద్మశ్రీ అవార్డు గ్రహిత సకిని రామచంద్రయ్య మనుమడు కుడి చెవికి గాయమైంది. వీరి అందరిని పరామర్శించిన కోటేశ్వరరావు వారి కుటుంబ సభ్యులను ఓదార్చి త్వరగా వారందరు కోలుకోవాలని ఆకాంక్షించారు. వారిని పరామర్శించేందుకు గుడిపూడి కోటేశ్వరరావుతొ పాటు పద్మశ్రీ సకిని రామచంద్రయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సకిని బాబురావు, కూనవరం ఆర్. ఎం. పి డాక్టర్ పాషా , మైనారిటీ నాయకుడు షాహిద్ తదితరులు పాల్గొన్నారు.



# రేషన్ కార్డు లేని వారికి గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలి

**కొత్తపల్లి శివకుమార్ ప్రజాపంథా జిల్లా ప్రధాన కార్యదర్శి**

**సూర్యాపేట,విశాలభారతి:** రేషన్ కార్డు లేని అర్హులైన పేదలందరికీ గృహలక్ష్మి పథకం వర్తింపజేయాలని సిపిఐ (ఎంఎల్)ప్రజా పంథా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు ధర్నా చేసి ఏవో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో గృహలక్ష్మి పథకం పేదల కోసం పెట్టడం దానికి మూడు లక్షల కేటాయించడం అభినందనీయం కానీ రేషన్ కార్డు ఉన్నవారికి ఈ పథకం వర్తిస్తుందని ఆంక్షలు పెట్టడం సరైన విధానం కాదని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈరోజు వరకు రేషన్ కార్డు కోసం కొన్ని లక్షల మంది దరఖాస్తులు చేసుకున్నారు కానీ ఏ ఒక్కరికి కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదు దీని వల్ల చాలామంది పేదలు ఈరోజు వరకు రేషన్ కార్డు లేక అవస్థలు పడుతున్నారు. కాబట్టి అర్హులైన పేదలకు వారి ఇతర ఆధారాలను పరిగణలోకి తీసుకొని వారు పేదవారా కాదా అని ఎంక్వయిరీ చేసి అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డు లేకున్నా మూడు లక్షల రూపాయల గృహ లక్ష్మీ పథకం వర్తింపజేయాలని మా పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఓ డబ్ల్యు జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పి డి ఎస్ యు జిల్లా కార్యదర్శి అఖిల్, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి రామోజీ, పి ఓ డబ్ల్యు జిల్లా అధ్యక్షులు చంద్రకళ జిల్లా నాయకులు రేణుక, జయమ్మ ,నాగన్న ,ఈరబాబు, శ్రీదేవి ,అనూష ,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

**మేడిపల్లి,విశాలభారతి:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కుషాయిగూడ నాగార్జున నగర్ కాలనీలోని సన్ సీడ్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ అన్వేష్ కల్కూరి పాల్గొని డాక్టర్ పుట్ల శ్రీనివాస్ గారికి కేక్ కట్ చేసిఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపరెంట్ డాక్టర్ డాక్టర్ భాను చందర్ సీఈవో రాములు హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బిటి రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు

**నూతనకల్,విశాలభారతి:** తుంగతుర్తి నియోజకవర్గంలోని నూతనకల్ నుండి మిర్యాల వరకు బిటి రోడ్ల నిర్మాణానికి ₹4 కోట్ల రూపాయలు ,నూతనకల్ నుండి సంగెం గ్రామ వరకు బీటీ రోడ్ల నిర్మాణం కొరకు 12కోట్ల రూపాయలు మంజూరు చేయించిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ని తిరుమలగిరిలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసిన నూతనకల్ ఎంపీపీ భూరెడ్డి కళావతి సంజీవరెడ్డి, జెడ్పిటిసి కందాల దామోదర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ కనకటి వెంకన్న, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మున్న మల్లయ్య యాదవ్ ,తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ నాయక్ , వైస్ ఎంపీపీ జక్కి పరమేష్,తుంగతుర్తి మార్కెట్ కమిటీ డైరెక్టర్ గాజుల తిరుమలరావు,ఆలయ చైర్మన్ కనకటి పళ్ళ వెంకన్న ,ఉప సర్పంచ్ మన్యం రమేష్, పెద్దింటి మధు ,తదితరులు పాల్గొన్నారు.



# శ్రీనివాసరావుని వెంటనే మణుగూరుకు బదిలీ చేయాలి

**మణుగూరు, విశాలభారతి:** మణుగూరుకి నూతనంగా వచ్చిన తహసిల్దార్ టి శ్రీనివాస్ రావును వెంటనే బదిలీ చేయడంపై అధికార పార్టీ హస్తం ఉందని బిజెపి టౌన్ అధ్యక్షులు లింగంపల్లి రమేష్ అన్నారు. భారతీయ జనతా పార్టీ మణుగూరు పట్టణ కార్యాలయం నందు మణుగూరు ఎమ్మార్పీఎస్ నాయకులతో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బిజెపి పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్ మాట్లాడుతూ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికారులను బదిలీ చేసే క్రమంలో మణుగూరుకు నూతనంగా వచ్చిన తహసిల్దార్ టి శ్రీనివాస్ రావును వెను వెంటనే బదిలీ చేయడంపై అధికార పార్టీ హస్తం ఉందని.. అధికార పార్టీకి లోబడి పని చేయనందుకే ఎమ్మార్వో మార్పు జరిగిందని ఆయన అన్నారు. దీని వెనక స్థానిక ఎమ్మెల్యే రేగా కాంతారావు పాత్ర ఉందని స్పష్టంగా మండల ప్రజలకు అర్థమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు లింగంపల్లి రమేష్, ఎంఆర్పిఎస్ నియోజకవర్గ కన్వీనర్ కొమ్ము హుస్సేన్ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు చెక్క రమేష్ నియోజకవర్గ కో కన్వీనర్ ఇసుకల కొండయ్య, నాయకులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

**సూర్యాపేట,విశాలభారతి:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో 20న జరుగనున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఏర్పాట్లను జిల్లా కలక్టర్ ఎస్ వెంకట్రావు, ఎస్పీ రాజేంద్రప్రసాద్ ఐపీఎస్ లు పరిశీలించారు. జిల్లా పోలీస్ కార్యాలయ నూతన భవనం, కలక్టరేట్ కార్యాలయం, మరియు ఇతర నూతన భవనాల ప్రారంభత్సవం సందర్భంగా పట్టణంలో రూట్ మ్యాప్ పరిశీలించారు. ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అన్నారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు, ప్రణాళిక ను పరిశీలించారు.ఎస్పీ వెంట అదనపు ఎస్పీ నాగేశ్వరరావు , డి.ఎస్.పి లు, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



# ప్రగతి నివేదన సభను జయప్రదం చేయండి

**నూతనకల్,విశాలభారతి:** ఆగస్టు 20 న సూర్యాపేటలో జరిగే ప్రగతి నివేదన సభకు అధిక సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని బిఆర్ఎస్ చిల్పకుంట్ల గ్రామ శాఖ అధ్యక్షులు పులుసు లింగమల్లయ్య గౌడ్ తెలియజేశారు. అందుకు అనుగుణంగా బుధవారం ఆ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. తుంగతుర్తి శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ఆదేశాల మేరకు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగిందని సూర్యాపేటలో జరిగే ప్రగతి నివేదన సభకు రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరావు వస్తున్నారు. కావున పెద్ద ఎత్తున కార్యకర్తలు ప్రజలు పాల్గొని విజయవంత చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బత్తుల సురేష్ గ్రామ సర్పంచ్ కొంపల్లి రామిరెడ్డి. ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు బత్తుల విజయకుమార్. మండల నాయకులు బాణాల సత్యనారాయణ రెడ్డి. బత్తుల గురవయ్య బి. వెంకన్న ,కృష్ణయ్య , ఎల్లయ్య ,బాణాల సత్యనారాయణ రెడ్డి ,రమసాని వెంకటరెడ్డి, వెంకన్న ,రామచంద్రు ,శ్యామ్, భిక్షం బొజ్జ సైదులు, బొజ్జ వెంకటేశు ,బత్తుల శ్రీనాథ్ పంతం వీరయ్య, కూసు నాగరాజు ,కొంత కృష్ణారెడ్డి బత్తుల గాంధీ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాకు మంత్రి చేసిన అభివృద్ధి 'శూన్యం'

**సూర్యాపేట,విశాలభారతి:** సూర్యాపేట పట్టణంలో బుదవారం గడపగడపకు కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ కార్యక్రమము 19వ వార్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణవనరులు దోచుకుంటు కల్వకుంట్ల కుటుంబం బాగుపడిందని విమర్శించారు.ఇంటింటికి వాచీలు పంపిణీ చేసిన స్థానిక మంత్రి జగదీశ్ రెడ్డి ని ఇంటికి పంపడానికి సూర్యాపేట నియోజకవర్గ ప్రజలు సిద్ధమయ్యారని జిల్లాలో మంత్రి చేసిన అభివృద్ధి శూన్యమని ప్రజల మధ్యకు వచ్చే దమ్ము లేక తన కుటుంబ సభ్యుల ను పంపిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీ గడిలో బానిసలు గా ఉండడం కన్న ప్రజాస్వామ్యం ఉన్న కాంగ్రెస్ పార్టీలో కి రావాలన్నారు. సీఎం కేసీఆర్ తెలంగాణ ద్రోహులకు పదవులు కట్టబెడుతూ ఉద్యమకారులను దూరంపెట్టారని మండిపడ్డారు.బీఆర్ఎస్ పాలనలో పేదలకు న్యాయం జరగడంలేదన్నారు. రానున్న ఎన్నికల లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం తధ్యం అని రమేష్ రెడ్డి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాలు ప్రజలందరికీ అందిస్తామన్నారు.




# గద్దర్ పేరు మీద జిల్లా నామకరణం చేయాలి

**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల దగ్గర విద్యార్థి అమరవీరుల స్తూపం వద్ద గద్దర్ కు సంస్మరణ సభను తెలంగాణ ఉద్యమకారులు బుధవారం ఏర్పాటు చేశారు. నిర్వాహకుల ఆహ్వానం మేరకు పినపాక నియోజకవర్గం బీఎస్పీ పార్టీ ఇంచార్జ్ అలెం కోటి హాజరై సంస్మరణ సభను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ కాలుకు గజ్జ కట్టి మాటల ద్వారా పాటల ద్వారా యావత్ భారతదేశాన్ని ఉర్రుత లూగించిన మహోన్నత వ్యక్తి అని అన్నారు. తెలంగాణ సాధించుటలో తన పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను అనుసరించి, బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పదనీ ఆయన మరణం యావత్ తెలంగాణ ప్రజలకు తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్పి పార్టీ మణుగూరు మండల అధ్యక్షుడు పీక మల్లేశం, బిఎస్పీ జనరల్ సెక్రటరీ నాగేశ్వర రావు, తెలంగాణ ఉద్యమకారులు వివిధ పార్టీల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన చెంచు తండా ప్రజలు

**హలియా,విశాలభారతి:** నూతన గ్రామపంచాయతీ ఏర్పాటు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ చెంచుతండా, మూల తండా గ్రామాల ప్రజలు సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే నోముల భగత్ కి కృతజ్ఞతలు తెలిపారు.తిరుమలగిరి మండలం, నెల్లికల్ గ్రామపంచాయతీ నుండి వేరుగా చేసి చెంచు తండా, మూలతాండ ను కలిపి నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసినందుకు నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ ను హాలియాలోని క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మారుమూల ప్రాంతాన్ని గ్రామపంచాయతీ గా చేసినందుకు సీఎం కేసీఆర్ కి రుణపడి ఉంటామని ఎల్లవేళలా బీఆర్ఎస్ పార్టీ కోసం ఎమ్మెల్యే భగత్ గెలుపు కోసం అహర్నిశలు కష్టపడతామని అన్నారు. చెంచువాని తండా గ్రామ పంచాయతీ నుండి కాంగ్రెస్ పార్టీ నాయకులు కేతవత్ బాలు, జాటావత్ మున్నా, జాటావత్ బాలు, శంకర్, లక్ష్మ, చందు, పంతు వీరితోపాటు పలువురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీని వీడి ఎమ్మెల్యే సమక్షం లో బీఆర్ఎస్ పార్టీలోకి చేరడం జరిగింది. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాధరంగా ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షుడు పిడిగం నాగయ్య, ఎంపీటీసీలు సుజాత పాండు నాయక్, శ్రీనివాస్ రెడ్డి, పెద్దిరాజు,రమేష్ నాయక్, కార్తీక్,జాటావత్ పాండు, ఎస్. బాలు, రవీందర్, ఈశ్వర్, సితియా, భోజ్య, హరి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద ప్రమాదం
- ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురి మృతి
- బాధితులను తేనె విక్రయించే కూలీలుగా గుర్తింపు

**వరంగల్,విశాలభారతి:** వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం ఇల్లంద వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వరంగల్ నుంచి తొర్రూరు వైపు వెళ్తున్న ఆటోను ఎదురుగా వచ్చిన ఓ లారీ ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆటోలో చిక్కుకుపోయిన మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. లారీ డ్రైవర్‌ను రాజస్థాన్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. మద్యం మత్తులో లారీని రాంగ్‌రూట్‌లో నిర్లక్ష్యంగా నడపడం వల్ల ప్రమాదం జరిగినట్టు ప్రాథమికంగా గుర్తించారు. బాధితులను తేనె విక్రయించే కూలీలని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.





## గ్రామాల అభివృద్దే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే చిరుమర్తి
- రూ.30 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**నార్కట్ పల్లి,విశాలభారతి:** నకిరేకల్ నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్దే ధ్యేయమని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నార్కట్ పల్లి మండలం ఔరవాణి గ్రామంలో రూ. 20 లక్షలతో ఏర్పాటు చేసే సీసీ రోడ్డు పనులకు, రూ. 5 లక్షలతో బీసీ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులకు, రూ. 5 లక్షలతో కల్వర్ట్ పనులకు ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే చిరుమర్తి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి వీధిలో సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామని మౌలిక సదుపాయాల్లో భాగంగా కమ్యూనిటీ హాళ్లు, పల్లె ప్రగతి, వైకుంఠ ధామంతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందరికీ అందేలా చూస్తూ గ్రామాలలో ఉన్న మౌలిక వసతులు సదుపాయాల రూపకల్పన పై దృష్టిపెట్టి ప్రణాళిక ప్రకారం గ్రామాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తూ మౌలిక సదుపాయాలని కల్పిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మాధగోని అండాలు నరసింహ గౌడ్, ఎంపీటీసీ జయలక్ష్మి వెంకటేశ్వర్లు, రైతు సమన్వయ సమితి అధ్యక్షులు యానాల అశోక్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండూరు శంకర్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బైరెడ్డి కరుణాకర్ రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు నీరుడు వేణుగోపాల్ రెడ్డి, వార్డు సభ్యులు వివిధ హోదాలలో ఉన్న నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## కొత్త నిర్మాణాలకు అమరుల పేర్లు పెట్టాలి

- సూర్యాపేట మెడికల్ కాలేజీకి కొండేటి వేణుగోపాల్ రెడ్డి, కలెక్టరేట్ కు ఉప్పల మల్సూర్ పేర్లు పెట్టాలి
- తెలంగాణ జన సమితి

**సూర్యాపేట,విశాలభారతి:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో భాగంగా కొత్త రాష్ట్రము కొత్త జిల్లాల నినాదం లో సాధించుకున్న సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్మించుకుని ఈ నెల 20న ప్రారంభించుకునేందుకు సిద్దంగా ఉన్న మెడికల్ కాలేజీకి తెలంగాణ ఉద్యమంలో ఆత్మ బలిదానం చేసుకున్న సూర్యాపేట ప్రాంత బిడ్డ కొండేటి వేణుగోపాల్ రెడ్డి మరియు స్వాతంత్ర సమరయోధుడు పారదర్శకతకు, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం అయినటువంటి సూర్యాపేట మాజీ శాసనసభ్యులు స్వర్గీయ ఉప్పల మల్సూర్ పేరును నూతన కలెక్టర్ కార్యాలయానికి పెట్టాలని తెలంగాణ జన సమితి సూర్యాపేట జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని కోరింది. బుధవారం సూర్యాపేట జిల్లా తెలంగాణ జన సమితి పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాంద్రమల్లయ్య యాదవ్, యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు నారబోయిన కిరణ్ లు మాట్లాడుతూ ఉద్యమ స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేందుకు మెడికల్ కాలేజీ ప్రాంగణంలో కొండేటి వేణుగోపాల్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసి కాలేజీకి పేరు పెట్టాలని మరియు నిజాయితీ తో కూడిన ప్రజాసేవకు మారుపేరైనటువంటి సూర్యాపేట తొలి దళిత శాసనసభ్యులు ఉప్పల మాల్సూర్ పేరు కలెక్టరేట్ కు పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కంబాలపల్లి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు బందన్ నాయక్, జిల్లా నాయకులు బోద్దు శంకర్ గౌడ్, జిల్లా కో కన్వీనర్ వీరేష్ నాయక్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు వినయ్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షులు బామర్ ఈశ్వర్ సింగ్ పట్టణ నాయకులు కృష్ణ, మధు తదితరులు పాల్గొన్నారు



## జర్నలిస్టులపై దాడి చేసిన నిందితులని శిక్షించాలి

**టి.జేయు జిల్లా అధ్యక్షులు షానూర్**

**ఆలేరు,విశాలభారతి:**జర్నలిస్టు లపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టిజేయు యాదాద్రి జిల్లా అధ్యక్షుడు మొహమ్మద్ షానూర్ బాబా అన్నారు. పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నల్గొండ జిల్లా వేములపల్లి మండల కేంద్రంలో పనిచేస్తున్న విలేకరులకి ఇళ్లస్థలాల కోసం అధికారులు బుగ్గ బావి గూడెంలో గ్రామ రెవెన్యూ పరిధిలో కేటాయించిన భూమిలో నివాసయోగ్యంగా మార్చుకుంటుండగా కొందరు వ్యక్తులు అకారణంగా జర్నలిస్టులపై దాడి చేయడం సరికాధన్నారు. సమాజంలో ప్రజా సమస్యలు పరిష్కారం కోసం అనునిత్యం కృషి చేస్తున్న జర్నలిస్టులపై దాడి చేయడం దుర్మార్గమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టులపై రోజురోజుకు దాడులు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని లేకపోతే యూనియన్ లకి అతీతంగా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మొహమ్మద్ కాజా పసియుద్దీన్, జిల్లా కార్యదర్శి బోడ నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు చింతకింది వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరేష్, మండల ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.



## ఎంజెఎఫ్ మండల అధ్యక్షలుగా లక్ష్మణ్

**మోతె,విశాలభారతి:** ఎంజెఎఫ్ మోతె మండల అధ్యక్షలుగా పల్లెల లక్ష్మణ్ ను ఏక్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఎంజెఎఫ్ సభ్యులు తెలిపారు. బుధవారం మండల కేంద్రం లో జరిగిన సమావేశంలో నూతన అధ్యక్షడిగా అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ తన పై నమ్మకంతో ఎంజెఎఫ్ మండల బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తూ మాదిగ జర్నిస్టుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నా ఎన్నిక కు సహకరించిన రాష్ట్ర జిల్లా స్థాయి నాయకుల కు కృతజ్ఞతలు తెలిపారు. నూతన అధ్యక్షుడిగా పల్లెల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా ఏర్పుల, సాయి కృష్ణ ప్రధాన కార్యదర్శి జిల్లాపల్లి శివ కృష్ణ ,సహాయ కార్యదర్శి గట్టి గుండ్ల రాము, కమిటీ సభ్యులు గా గురిజాల వెంకన్న, మాలోతు కోటి, కొండ ఉదయ్ గౌరవ అధ్యక్షులు కాంపాటి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## సర్వాయి పాపన్న జయంతి జయప్రదం చేయండి

**అనంతగిరి,విశాలభారతి:** సర్దార్ సర్వాయి పాపన్న 373 వ జయంతి వేడుకలు జయప్రదం చేయాలని గీత కార్మికుల సంఘం నాయకులు కోరారు.ఈ సందర్భంగా మండల పరిధిలోని పాలవరం గ్రామ కంఠమహేశ్వర దేవస్థానంలో ఏర్పాటుచేసిన కల్లుగీత కార్మికుల సంఘం యొక్క సమావేశం ప్రధాన కార్యదర్శి మట్టపల్లి సిద్దయ్య అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా జిల్లా కార్యదర్శి మడ్డి అంజిబాబు మాట్లాడుతూ సామాజిక చైతన్య యాత్ర సర్దార్ సర్వాయి పాపన్న జయంతి ఉత్సవాలు ఆగస్టు 2 నుండి 18 వరకు జరిగే యాత్రలు జయప్రదం చేయాలని కోరారు. సర్వాయి పాపన్న జయంతిలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో పబ్లిక్ క్లబ్ లో సభ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న సభకు అధిక సంఖ్యలో కల్లుగీత కార్మికులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు. గత 20 సంవత్సరాల నుండి కల్లుగీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో ఇలాంటి సభలు నిర్వహిస్తున్నామని రాష్ట్రవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు 2 నుండి 18 వరకు సుమారు 17 రోజుల వరకు రాష్ట యాత్రలు నిర్వహిస్తున్నామని కల్లుగీత కార్మికుల హక్కుల కోసం పోరాడి అమరులైన కామ్రేడ్ బొమ్మ గాని ధర్మభిక్షం ,ఎస్సార్ దాట్ల ,తొట్ల మల్సూర్, చిన్న మల్లయ్య ,జగన్నాథం, పుల్లయ్య, బుచ్చి రాములు, మల్లయ్య, తదితర సంఘం నాయకులను స్మరించుకుంటూ యాత్రలు కొనసాగుతాయి అన్నారు. గీత కార్మికులందరికీ ద్విచక్ర వాహనం, సేఫ్టీ మోకులు ఇవ్వాలని, బీసీ కుల వృత్తిదారులకు ప్రభుత్వం ఇస్తానన్న లక్ష రూపాయలు గీత కార్మికులందరికీ అందేలా చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జెర్రిపోతుల కృష్ణ, కమిటీ సభ్యులు అబ్బ గాని కాశయ్య, బోడ సైదులు, కప్పల సత్య నారాయణ ,మట్టపల్లి నారాయణ ,మట్టపల్లి రామకోటయ్య, బెల్లంకొండ ఉపేందర్, మట్టపల్లి బాలకోటయ్య ,సత్యం వెంకయ్య ,పెద్ద వెంకన్న, గీత కార్మికుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఎన్నికల ముందు బీసీ ఆగ్రహనికి గురి కావొద్దు

- ఆర్ కృష్ణయ్య జోలికి వస్తే మూల్యం తప్పదు
- జాతీయ బీసీ విద్యార్థి సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు వీరబోయిన లింగయ్య యాదవ్

**సూర్యాపేట,విశాలభారతి:** జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య బీసీ ఉద్యమ నాయకులు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తుంటే కేసీఆర్ ప్రభుత్వం, పోలీసులు అక్రమంగా జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య మరియు బీసీ ఉద్యమ నాయకులను అరెస్టు చేయటం పట్ల జాతీయ బీసీ విద్యార్థి సంఘం నేత లింగయ్య యాదవ్ ఖండించారు. ఆర్ కృష్ణయ్య మిగతా బీసీ సంక్షేమ సంఘం నాయకులను విడుదల చేయాలని లేని పక్షంలో ఎన్నికలకు ముందు బీసీల ఆగ్రహానికి గురికాక తప్పదని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు బీసీ నాయకులు చేపడతారని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాము అన్నారు. కృష్ణయ్య తో పాటు ధర్నా చేస్తున్నటువంటి జాతీయ బీసీ సంక్షేమ సంఘం కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, రాజ్ కుమార్, భూపేష్ సాగర్ ,జిల్లేపల్లి అంజి ,వేములపల్లి రామకృష్ణ, అనంతయ్య ఉద్యమ నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నము. ఈ సమావేశంలో విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడు పొలోజు మహేష్‌చారి ,జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పుల మహేష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ దంపతులకు సన్మానం

**అనంతగిరి,విశాలభారతి:** మండల పరిధిలోని శాంతినగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బద్దం పుల్లారెడ్డి దంపతులకు బుధవారం వివాహ వజ్రోత్సవ వేడుకను మండల పరిధిలోని శాంతినగర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారెడ్డి దంపతులు తమ వివాహ వార్షికోత్సవ సందర్భంగా బాలికలకు 25 వేల రూపాయల డ్రెస్ మెటీరియల్ ఒక్కొక్కరికి 200 రూపాయల నగదును అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు సుజాత దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ పాఠశాల సిబ్బందితో కలిసి పుల్లారెడ్డి దంపతులకు శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## ఆధిపత్య దురహంకారులను శిక్షించాలి

**ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా**

**పాలకుర్తి,విశాలభారతి:**చెన్నూరు గ్రామంలో 12 ఏళ్ల బాలికపై దొంగతనం నెపం వేసి ఆటవిక పద్ధతుల్లో చిత్రహింసలకు గురి చేసిన ఆధిపత్య దురాహంకారులను కఠినంగా శిక్షించాలని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సింగారపు రమేష్, బహుజన కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి రాజుల సాంబయ్య, బహుజన ముక్తి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు నరేంద్ర పవర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం కేంద్రంలో రాజీవ్ చౌరస్తా వద్ద రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ " ఘటన జరిగి 20 రోజులు గడిచినప్పటికీ నిందితులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. చేనేత కుటుంబానికి చెందిన రేగొండ సంగీత అనే 12 ఏళ్ల బాలిక, ఆమె తల్లిదండ్రులు సుజాత గణేష్ లను చిత్రహింసలకు గురి చేసారని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వీరిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని.. న్యాయం వైపు నిలబడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు, సిపిఎం మండల కార్యదర్శి మాచర్ల సారయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమసత్యం, లిబరేషన్ జిల్లా కార్యదర్శి మాన్యపు బుజేందర్ ఇతర ప్రజా సంఘాలు, సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శి పై కలెక్టర్కు ఫిర్యాదు

**అనంతగిరి,విశాలభారతి:** పంచాయతీ కార్యదర్శి పై బుధవారం మండల పరిధిలోని వాయిల సింగారం గ్రామస్తులు జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు నడుచుకోకుండా పంచాయతీ కార్యదర్శి తన ఇష్టం వచ్చినట్టు వ్యవహరిస్తూ సొంత నిర్ణయాలతో జెండా ఆవిష్కరణ చేయించారని ప్రభుత్వ పాఠశాలకు, ప్రైవేట్ పాఠశాలలకు, గ్రామంలో ఉన్న అనేక ప్రభుత్వ సంస్థలకు, మాజీ సర్పంచులకు, వివిధ పార్టీ నాయకులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా తన ఇష్టానుసారంగా జండా ఆవిష్కరణ చేయించారని ఇదేంటని ప్రశ్నించిన వారిపై దురుసుగా సమాధానం ఇస్తున్నారని వారు ఆ లేఖలో పేర్కొన్నారు.ఇలాంటి అధికారులు మూలంగా ప్రజలకు దేశంపై భక్తి శ్రద్ధలు ఉండవని దేశం మీద ప్రేమ అభిమానాలు దిగజారిపోయే ప్రమాదం కూడా ఉందని ఇలాంటి కార్య కలాపాలకు పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శి పై కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో పేర్కొన్నారు.అనంతరం ఆ లేఖను కలెక్టర్కు అందజేశారు.



## మానసిక ఆరోగ్యం పట్ల మరింత శ్రద్ధ వహించాలి

**కోదాడ,విశాలభారతి:**మానసిక సమస్యలు ఉన్నవారు సూచనలు సలహాలు కొరకు 14416 నెంబర్ కి ఫోన్ చేసి ఉచిత సూచనలు సలహాలు తీసుకోవాలని జిల్లా అసంక్రమిత వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి సూచించారు. బుధవారం గుడిబండ పల్లె దవాఖానను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామాల పరిధిలో నూతనంగా ఏర్పాటుచేసిన 122 పల్లె దవాఖానాలలో అందుబాటులో ఉన్న వైద్య సౌకర్యాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మానసిక ఆరోగ్యం అత్యంత ముఖ్యమైన అంశమని ప్రజలకు ఇట్టి అంశంపై అవగాహన కల్పించాలని సిబ్బందిని కోరారు. అనంతరం రికార్డులు పరిశీలించారు. ఇంటింటికి వెళ్లి కుష్టు వ్యాధిగ్రస్తుల సర్వే ని నిర్వహించి ఆ వివరాలు ఎప్పటికప్పుడు వైద్యాధికారి కి అందజేయాలని ఆదేశించారు. వ్యాధి నిరోధక టీకాల వివరాలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ చేయాలని తెలిపారు. బిపి, షుగర్ వ్యాధిగ్రస్తుల కొరకు తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన కాంబినేషన్ డ్రగ్స్ ప్రజలకు అందుబాటులో ఉంచాలని, వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. నెలకు సరిపడా మందులు బిపి షుగర్ వ్యాధిగ్రస్తులకు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త సుధా, ఆశా కార్యకర్తలు కళావతి, వెంకమ్మ , సుజాత పాల్గొన్నారు.



## గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ లాంచ్ చేసిన 'బెదురులంక 2012' ట్రైలర్

డిసెంబర్ 21, 1012... ప్రపంచమంతా యుగాంతం వస్తుందని భయపడిన రోజు! ఆ రోజు యుగాంతం రాలేదు. అయితే, ఆంధ్రప్రదేశ్‌లోని లంక గ్రామాల్లో ఓ గ్రామమైన బెదురులంకలో కొందరు కేటుగాళ్ళు ప్రజల్లో భక్తిని, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని యుగాంతం అంటూ భయపెట్టి దేవుడి పేరుతో దోపిడీకి తెర తీశారు. వాళ్ళ మాయమాటలు నమ్మని శివ శంకర వరప్రసాద్ ఏం చేశాడు? అనేది ఆగస్టు 25న వెండితెరపై చూడాలి. ఎందుకంటే... శివ శంకర వరప్రసాద్ పాత్రలో యువ హీరో కార్తికేయ గుమ్మకొండ ఆ రోజు నుంచి థియేటర్లలో సందడి చేయనున్నారు. కార్తికేయ గుమ్మకొండ, 'డీజే టిల్లు' ఫేమ్ నేహా శెట్టి జంటగా నటించిన సినిమా 'బెదురులంక 2012'. లౌక్య ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి. యువరాజ్ సమర్పణలో రవీంద్ర బెనర్జీ (బెన్నీ) ముప్పానేని నిర్మించారు. ఈ సినిమాతో క్లాక్స్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆగస్టు 25న థియేటర్లలో విడుదలకు సిద్ధమైందీ సినిమా. మెగాస్టార్ చిరంజీవికి కార్తికేయ వీరాభిమాని అనే సంగతి తెలిసిందే. చిరంజీవి అసలు పేరు శివశంకర వరప్రసాద్. 'బెదురులంక 2012'లో కార్తికేయ క్యారెక్టర్ పేరు కూడా అదే. ఇప్పుడీ సినిమా ట్రైలర్ సైతం చిరు తనయుడు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ చేతుల మీదుగా విడుదల చేశారు. ట్రైలర్ విడుదల చేసిన అనంతరం సినిమా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ కార్తికేయకు, చిత్ర బృందానికి రామ్ చరణ్ శుభాకాంక్షలు చెప్పారు. రామ్ చరణ్ మాట్లాడుతూ ''కార్తికేయ, నేహా శెట్టిల జంట చాలా బాగుంది. ఇద్దరు చూడముచ్చటగా ఉన్నారు. 'బెదురులంక 2012' ట్రైలర్, ఇందులో చెప్పిన కథ చాలా బాగుంది. అజయ్ ఘోష్ గారి పాత్ర వచ్చినప్పటి నుంచి ఇంకా బాగుంది. సంగీతం కూడా చాలా కొత్తగా వినిపించింది. 'ఆర్ఎక్స్ 100' సెన్సేషనల్ హిట్ అయ్యింది. కార్తికేయ కొత్త కాన్సెప్ట్ సెలెక్ట్ చేసుకుని సినిమాలు చేస్తారు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను. యూనిట్ అందరికీ ఆల్ ద బెస్ట్'' అని అన్నారు. 'బెదురులంక 2012' ట్రైలర్ విడుదలైన కొన్ని క్షణాల్లోనే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభించిందని దర్శక నిర్మాతలు బెన్నీ, క్లాక్స్ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పటికే విడుదలైన పాటలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయని చెప్పారు. ప్రేక్షకుల్ని ఈ సినిమా కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుందని, గోదావరి నేపథ్యంలో సినిమాలకు ఇదొక బెంచ్ మార్క్ సెట్ చేస్తుందని దర్శక, నిర్మాతలు తెలిపారు.

సౌత్ ఇండియన్ స్టార్ హీరోయిన్ సమంత ప్రస్తుతం ఖుషి మూవీ కంప్లీట్ చేసింది. సినిమాలకి ఏడాదిపాటుగా గ్యాప్ ఇవ్వాలని డిసైడ్ అయిన ఈ బ్యూటీ ప్రస్తుతం ఎలాంటి కమిట్మెంట్ లు చేయలేదు. చేతిలో ఉన్న ప్రాజెక్ట్స్ వరకు కంప్లీట్ చేసింది. ఆ మధ్య ఓ హాలీవుడ్ మూవీలో చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందనే మాట ఆ మధ్య వినిపించింది. అయితే దీనిపై ఎలాంటి అప్డేట్ లేదు. సినిమాల నుంచి కొంతకాలం విశ్రాంతి తీసుకోవాలని డిసైడ్ అయినా కూడా సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. తనకి సంబంధించిన అన్ని అప్డేట్స్ ని పంచుకుంటుంది. ప్రస్తుతం వెకేషన్ మూడ్ ని ఎంజాయ్ చేస్తోన్న సమంత మరో విప్పు ఖుషి సినిమాని ఇన్ స్టాగ్రామ్ ద్వారా ప్రమోట్ చేసే చేస్తోంది. అలాగే ఈ మధ్య కాస్ట్యూమ్స్ విషయంలో సమంత చాలా ప్రత్యేకత చూపిస్తుంది. రెగ్యులర్ హీరోయిన్స్ తరహాలో గ్లామర్ షోతో సమంత కనిపించడం లేదు. ఫుల్ ప్యాంట్, షర్ట్ మాత్రమే ఎలివేట్ అయ్యే విధంగా ఫుల్ డ్రెస్ వేస్తోంది. సమంత ప్రస్తుత డ్రెస్సింగ్ స్టైల్ లో మిగిలిన హీరోయిన్స్ లో ఎవరు ఫాలో కావడం లేదు. అందాల ప్రదర్శన కంటే వ్యక్తిత్వాన్ని, కాన్ఫిడెంట్ ని ఎస్టాబ్లిష్ చేసే విధంగా సమంత కాస్ట్యూమ్స్ స్టైల్ ఉన్నాయి. ఓ విధంగా చెప్పాలంటే ఫ్యూచర్ మహారాణి తరహాలో సమంత ఈ డ్రెస్సింగ్ స్టైల్ లో దర్శనం ఇస్తోంది. తాజాగా ఆమె వైట్ కలర్ డ్రెస్ లో ఇన్ స్టాగ్రామ్ లో మెస్మరైజ్ చేస్తోంది. కళ్ళజోడు పెట్టుకొని ప్యాంట్, షర్ట్ తో టక్ వేసి స్టన్నింగ్ లుక్స్ తో కేక పుట్టిస్తోంది.ఈ ఫోటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. సమంత షేర్ చేసిన డిఫరెంట్ డ్రెస్సింగ్ స్టైల్ ఫోటోలని ఇన్ స్టాగ్రామ్ లో ఏకంగా 4.79 లక్షల మంది లైక్ చేయడం విశేషం. సమంత ఎలాంటి కాస్ట్యూమ్ వేసిన వాటికే కొత్త అందం వస్తాయని, ఫ్యాషన్ ప్రపంచంలో ఇప్పుడు సామ్ ట్రెండ్ సెట్టర్ గా ఉందనే మాట వినిపిస్తోంది.



## మట్కా' లుక్ టెస్ట్ & వర్క్‌షాప్ కోసం నోరా ఫతేహి




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ తొలి పాన్ ఇండియా మూవీ 'మట్కా'. పలాస ఫేమ్ దర్శకుడు కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్, డ్యాన్సర్ నోరా ఫతేహి ఒక హీరోయిన్ గా నటిస్తున్నారు. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై మోహన్ చెరుకూరి (సివిఎం), డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల భారీ స్థాయిలో నిర్మించనున్న ఈ చిత్రం ప్రారంభోత్సవ వేడుక ఇటీవలే ఘనంగా జరిగింది. నోరా ఫతేహి కి డ్యాన్స్ నంబర్ ఉంటుంది, ఆమె పాత్ర చాలా కీలకమైనది. షూటింగ్ ఇంకా ప్రారంభం కానప్పటికీ, సినిమాలో ఛాలెంజింగ్ క్యారెక్టర్‌లో నటించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుంది. 19581982 మధ్య కాలంలో జరిగే సినిమా కథలో వైజాగ్ అమ్మాయిగా నటించడం పెద్ద ఛాలెంజ్. నోరా ఫతేహి ప్రస్తుతం హైదరాబాద్‌లో వున్నారు. మూడు రోజుల పాటు ఆమె టీమ్‌తో వుంటారు. మొదట్లో నోరాకి లుక్ టెస్ట్ చేశారు. తర్వాత పాత్ర ప్రిపరేషన్ కోసం వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. సబ్జెక్ట్‌ని ఇష్టపడి, తన పాత్రను పోషించడానికి సిద్ధంగా ఉన్న నోరా, మేకింగ్ దశలో తప్పులు జరగకూడదని అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఆమె అంకితభావనికి యూనిట్ సర్ప్రైజ్ అయ్యింది. మొదటి పాన్ ఇండియా ప్రాజెక్ట్. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషలలో విడుదల కానుంది.



## మ్యూజిక్ లవర్స్ ను మెస్మరైజ్ చేసిన ఖుషి

విజయ్ దేవరకొండ, సమంత హీరో హీరోయిన్లుగా నటిస్తున్న 'ఖుషి' సినిమా మ్యూజిక్ కన్సర్ట్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమం ఆద్యంతం మ్యూజిక్ లవర్స్ ను మెస్మరైజ్ చేసింది. ఈ మ్యూజిక్ కన్సర్ట్ లో 'ఖుషి' సినిమాలోని బ్యూటిఫుల్ సాంగ్స్ ను సింగర్స్ జావెద్ అలీ, సిద్ శ్రీరామ్, మంజూష, చిన్మయి, సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వాహబ్ పాడి ఆకట్టుకున్నారు. 'ఖుషి' టైటిల్ సాంగ్ లో విజయ్ దేవరకొండ, సమంత లైవ్ పర్ ఫార్మెన్స్ కు ఆడియెన్స్ స్టాండింగ్ ఒవేషన్ ఇచ్చారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మాణంలో దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కించిన 'ఖుషి' పాన్ ఇండియా స్థాయిలో సెప్టెంబర్ 1న రిలీజ్ కు రెడీ అవుతోంది. మ్యూజిక్ కన్సర్ట్ లో మైత్రీ సీఈవో చెర్రీ మాట్లాడుతూ 'ఖుషి' మ్యూజిక్ కన్సర్ట్ ను ఇంత గ్రాండ్ గా ఆర్గనైజ్ చేయడం సంతోషంగా ఉంది. మాకు ఒక మెమొరబుల్ మూవీ చేసిన డైరెక్టర్ శివ గారికి థాంక్స్. 'ఖుషి' కోసం ఏదైనా బిగ్ ఈవెంట్ చేయాలనుకున్నప్పుడు మ్యూజిక్ కన్సర్ట్ బాగుంటుందని అనిపించింది అన్నారు. నిర్మాత నవీన్ యెర్నేని మాట్లాడుతూ మా సంస్థ తరుపున ఇప్పటిదాకా చాలా ఈవెంట్స్ చేశాం. విజయ్ గారు మా సంస్థలో డియర్ కామ్రేడ్ చేశారు. 'ఖుషి' సినిమా మీద చాలా కాన్ఫిడెంట్ గా ఉన్నా. ఈ సినిమా పెద్ద హిట్ కాబోతోంది. సమంత గారు మా మైత్రీలో చేసిన ప్రతి మూవీ బ్లాక్ బస్టరే. 'ఖుషి' కాస్ట్ అండ్ క్రూ అందరికీ థాంక్స్. సెప్టెంబర్ 1న థియేటర్స్ లో మా సినిమా చూడండి అన్నారు. హీరోయిన్ సమంత మాట్లాడుతూ షూటింగ్ టైమ్ లో పాటలు విని 'ఖుషి' ఆల్బమ్ లవ్ లో పడిపోయాను. మైత్రీ ప్రొడ్యూసర్స్ నా ఫేవరేట్ ప్రొడ్యూసర్స్. నా ఫేవరేట్ హ్యూమన్ బీయింగ్స్ కూడా వాళ్లే. గత ఏడాదిగా నాకు వాళ్లు ఇస్తున్న సపోర్ట్ మర్చిపోలేను. నా కెరీర్ లో మెమొరబుల్ మూవీ 'ఖుషి' అని చెప్పింది. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ 'ఖుషి' మ్యూజిక్ కన్సర్ట్ కోసం ఇక్కడికి వచ్చిన వారికి, టీవీ, యూట్యూబ్ లో చూస్తున్న వారందరికీ నా థ్యాంక్స్. సెప్టెంబర్ 1న నా తరుపున మీకు ఖుషి తీసుకొస్తున్నా. అలాగే మా డైరెక్టర్ శివకు హిట్ ఇవ్వాలని కోరుకుంటున్నా. మా మైత్రీ వాళ్లకు పుష్ప 2 ఉంది. వాళ్లకు డబ్బులే డబ్బులు. నేను ఇండస్ట్రీకి వచ్చి ఆరేడు ఏళ్లు అవుతోంది. నన్ను మీరంతా ఎంతగానో ప్రేమిస్తున్నారు. నా హిట్స్, ఫ్లాప్స్ లో నా చుట్టూ ఉన్న వాళ్లు ఎందరు మారినా మీరు మారలేదు. నాపై లవ్ చూపిస్తూ నాతోనే ఉన్నారు. సెప్టెంబర్ 1న మీ అందరి మొహాల్లో నవ్వు చూడాలని అనుకుంటున్నా. అని అన్నారు.

## డిసెంబర్ 8 న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'



సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలు గోదావరి డెల్టా నేపథ్యంలో పీరియడ్‌గ్యాంగ్‌స్టర్‌డ్రామా గా రూపొందుతోన్న 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' అనే చిత్రం కోసం యువ సంచలనం విశ్వక్ సేన్‌తో చేతులు కలిపాయి. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మునుపెన్నడూ చూడని గ్రే పాత్రలో కనిపించనున్నారు. క్రూరమైన, నేరపూరితమైన చీకటి సామ్రాజ్యంలో సామాన్యుడి నుంచి సంపన్నుడిగా ఎదగాలని కోరుకునే వ్యక్తి కథగా ఈ చిత్రం రూపొందుతోంది. 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' సినిమా, రచయితదర్శకుడు కృష్ణ చైతన్య మస్తిష్కంలో పుట్టిన ఆలోచన. కథ పట్ల ఎంతో నమ్మకంగా ఉన్న ఆయన సృజనాత్మకతతో చిత్రాన్ని ఎంతో అందంగా మలుస్తున్నారు. వైవిధ్య భరిత చిత్రాలతో తమ అభిరుచిని చాటుకున్న నిర్మాతలు సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'ని ప్రేక్షకులను గొప్ప అనుభూతిని పంచే చిత్రంగా మలచడానికి ఏమాత్రం వెనకడుగు వేయకుండా రూపొందిస్తున్నారు. ప్రముఖ సంగీత దర్శకులు యువన్ శంకర్ రాజా ఈ చిత్రానికి సంగీతం సమకూరుస్తున్నారు. ఆయన స్వర కల్పనలో హృదయాన్ని హత్తుకునే మొదటి గీతం 'సుట్టంలా సూసి', ఆగస్ట్ 16న మల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఘనంగా జరిగిన వేడుకలో విడుదలైంది. కథానాయకుడు విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. "మల్లారెడ్డి కాలేజ్ నాకు సెంటిమెంట్. ఫలక్‌నుమా దాస్ మూవీ ఈవెంట్ కూడా అప్పుడు ఇక్కడే జరిగింది. నేను యువన్ గారి సంగీతానికి పెద్ద అభిమానిని. ఆయన స్వరపరిచిన ఎన్నో పాటలు ఏళ్ల తరబడి వింటూనే ఉంటాం. యువన్ గారితో కలిసి పని చేయాలని కోరుకునే వాడిని. ఇప్పుడు ఆ కల నిజం కావడం సంతోషంగా ఉంది " అన్నారు.



## 'మంగళవారం'లో తొలి పాట



'ఆర్ఎక్స్ 100', 'మహాసముద్రం' చిత్రాల తర్వాత అజయ్ భూపతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'మంగళవారం'. పాయల్ రాజ్‌పుత్ ఓ ప్రధాన పాత్రలో నటించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ముద్ర మీడియా వర్క్స్ పతాకంపై స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మిస్తున్నారు. ఈ రోజు సినిమాలో తొలి పాట 'గణగణ మోగాలిరా...' విడుదల చేశారు. జాతర నేపథ్యంలో 'గణగణ మోగాలిరా...' పాటను తెరకెక్కించారు. పాన్ ఇండియా హిట్ 'కాంతారా', తెలుగులో 'విరూపాక్ష' సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న బి. అజనీష్ లోక్‌నాథ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఆయన ఇచ్చిన బాణీకి భాస్కరభట్ల సాహిత్యం అందించగా... వి.ఎం. మహాలింగం ఆలపించారు. ఆల్రెడీ విడుదలైన 'మంగళవారం' టీజర్ ప్రేక్షకుల్లో ఉత్కంఠ కలిగించింది. కథపై క్యూరియాసిటీ క్రియేట్ చేసింది. 'ఏం చూశారండీ?' అని లక్ష్మణ్ అడిగితే 'ఒరేయ్ పులి! కాసేపు నువ్వు పువ్వు మూసుకుని గమ్మున ఉండరా' అని అజయ్ ఘోష్ సమాధానం ఇవ్వడం... తుపాకీతో చైతన్య కృష్ణ గురి పెట్టడం... అమ్మవారి మాస్క్ ఎవరో తీసుకోవడం, గొంగళి కప్పుకొని మంటల మధ్యలో పాయల్ నిలబడటం, గట్టిగా ఆవేదన వ్యక్తం చేస్తూ అరవడం... ప్రతి విజువల్ ఓ ప్రశ్న వదిలింది.

## పాత్ర ఎలాంటిదైనా అందులో సీతమ్మ స్పెషల్!

సీతారామం' తో పూణే బ్యూటీ మృణాల్ ఠాకూర్ తెలుగింట ఎంత ఫేమస్ అయిందో చెప్పాల్సిన పనిలేదు. తొలి సినిమా విజయం తర్వాత ఇక్కడ వేగంగా సినిమాలు చేయకపోయినా! అమ్మడి ఇమేజ్ మాత్రం ఎక్కడా చెక్కు చెదరలేదు. అవకాశాలు రాక చేయలేదా? వచ్చినా వద్దనుకుని తగ్గిందా? అన్నది తెలియదు కానీ...అమ్మడి తాజా ప్రోగ్రస్ చూస్తే మనసంతా బాలీవుడ్ పైనే ఉన్నట్లు కనిపిస్తుంది. తెలుగులో నేచురల్ స్టార్ నాని సరసన ఓ సినిమా చేస్తున్నప్పటికీ మృణాల్ బాలీవుడ్ కమిట్ మెంట్లు ఎక్కువ కనిపిస్తున్నాయి. అక్కడా ఏ చిన్న ఛాన్స్ వచ్చినా విడిచిపెట్టడం లేదు. నో అనకుండా నటించి వెళ్లిపోతుంది. ఇలా కమిట్ అవ్వడం వెనుక ఓ ప్రత్యేక కారణం కనిపిస్తుంది. మృణాల్ ఎలాంటి బ్యాకప్ లేకుండా వచ్చి ప్రూవ్ చేసుకున్న నటి. సినిమాలకంటే ముందు వెబ్ సిరీస్ లు చేసింది. కొన్ని టెలివిజన్ షోస్ కూడా చేసింది. ఈ నేపథ్యంలోనే అక్కడ వచ్చిన చిన్న చిన్న అవకాశాలు కూడా ఇప్పటికీ వదులుకోవడం లేదు. ఇప్పటికే పలు సిరీస్ ల్లో చిన్న పాత్రలు పోషించినా...తెరపై కనిపించిన కాసేపు ఆ పాత్ర ఆకట్టుకునేలా చేసింది. తాజాగా రిలీజ్ అయిన 'మెడి ఇన్ హెవెన్' టీవీ సిరీస్ లోనూ మృణాల్ అదరగొట్టింది. ఇందులో మృణాల్ మెయిన్ లీడ్ పోషించలేదు..కీలక పాత్ర పోషించలేదు. కేవలం గెస్ట్ పాత్ర లోనై తనదైన ముద్ర వేసింది. ఓ సంపన్న వ్యాపార వేత్త-మృణాల్ మధ్య సన్నివేశాలు ఆద్యంతం రక్తి కట్టిస్తాయి. ఆ జీవితంలో మృణాల్ పాత్ర యొక్క చీకటి కోణాన్ని ఎంతో అద్భుతంగా ఆవిష్కరించారు. ఆ పాత్రకి మృణాల్ మాత్రమే న్యాయం చేయగలదని మరోసారి నిరూపించింది. ఓ సాధారణ మహిళ శారీర..మానసిక ఇబ్బందులకు గురైతే ఎలా ఉంటుందో.. మృణాల్ పాత్రలో కళ్లకు కట్టారు. కొట్టడం..తిట్టడం..కాలి బూట్లతో తన్నడం వంటి సన్నివేశాలు ఎంతో హృద్యంగా ఉన్నాయి. ఆ పాత్రలో మృణాల్ అభినయం.. ఆహార్యం అద్భుతం. ఎలాంటి పాత్రైనా అవలీలగా పోషించగల నటి అని మృణాల్ మరోసారి నిరూపించింది.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.